







నార బాంబులు పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు.. గాయాలపాలైన మృతుడి తల్లిదండ్రులు సావిత్రి, శ్రీనివాస్

నార బాంబులు చుడుతుండగా పేలుడు

- భర్త మృతి..భార్య పరిస్థితి విషమం
- మరో ఇద్దరికి గాయాలు..బాలుడు సేఫ్
- ఏడిదలో కుప్పకూలిన పెంకుటిల్లు

మండపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దీపావళి ఆ ఇంట విషాదం నింపింది..పండుగను పురస్కరించుకుని నార బాంబులు చుడుతుండగా పెనుప్రమాదం సంభవించింది... ఆదమరిస్తే ఎంత ప్రమాదమో చాటిచెప్పింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద పంచాయతీ ఆరో వార్డు రామాలయం వీధిలో కల్లి వెంకటకృష్ణ(30) రెండు పోర్షన్ల ఇంట్లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. దీపావళిని పురస్కరించుకుని తన ఇంట్లో భార్య జయశ్రీతో కలిసి అవుట్లు తయారు చేస్తున్నాడు. ఇదిలా ఉండగా సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ఒక్కసారిగా మందుగుండు సామగ్రి పేలడంతో భారీ శబ్దం వచ్చింది. దీంతో అతని పెంకుటిల్లు పైకప్పుతో సహా, సమీపంలో ఉన్న వంటషెడ్డు(రేకులషెడ్డు) కుప్పకూలిపోయాయి. పేలుడు ధాటికి వెంకటకృష్ణ తీవ్రగాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెంది నట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య జయశ్రీకి తీవ్రగాయాలు కాగా ఆమెను మండపేట ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో మృతుడు వెంకటకృష్ణ తండ్రి శ్రీనివాస్, తల్లి సావిత్రి ఇంట్లో నిద్రిస్తున్నారు. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో వారిద్దరూ తీవ్రగాయాలపాల య్యారు. 108లో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. మృతుడు వెంకటకృష్ణకు ఏడాది బాబు ఉన్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండడంతో క్షేమంగా బయటపడ్డాడు. ఘటనా స్థలాన్ని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, రూరల్ సీఐ వీతల దొరైరాజు, రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు, జిల్లా ఫైర్‌అధికారి పార్థసారథి, మండపేట ఫైర్ అధికారి హనుమంతరావు పర్యవేక్షించారు. మండపేట తహశీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. క్షతగాత్రుల కు మెరుగైన వైద్య సేవలందించాలని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వెలుగు వెంటే చీకటి ఉంటుంది.. ఆనందం వెంటే విషాదం ఉంటుంది.. కాస్త ఆదమరుపుగా ఉన్నామా పెను ప్రమాదమే సంభవిస్తుంది.. ప్రాణాలనే హరించేస్తుంది.. దీపావళి ఆనందమే వేరు.. బాంబుల మోతమోగిపోవాల్సిందే.. తారాజువ్వలు ఆకాశాన్ని తాకి రావాల్సిందే.. ఫైవ్ థౌజండ్.. టెన్ థౌజండ్ వాలాలతో సందడి చేయాల్సిందే.. ఈ సందడిలో జాగ్రత్త మర్చిపోతున్నారు.. ప్రమాదాలకు గురవుతున్నారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అధికార.. అనధికార బాణసంచా తయారీ కేంద్రాలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి.. దీంతో ప్రతి ఏడాది జిల్లాను ఏదో ఒక ప్రమాదం వెంటాడుతూనే ఉంటుంది.. అయినా అధికారులకు మామూలే.. అన్నీ తెలిసినా చూసీచూడనట్టు వదిలేస్తారు.. ప్రమాదం జరిగినప్పుడు మాత్రం హడావుడి చేస్తారు.. ఈ ఏడాదీ అంతే. మరో మూడు రోజుల్లో దీపావళి పండుగకు సన్నద్ధమవుతున్నాం.. అయినా అధికారులు చేపట్టిన తనిఖీల్లేవ్.. పట్టుకున్న అనధికార తయారీ కేంద్రాలు లేవు.. సోమవారం మండపేట మండలం ఏడిదలో జరిగిన ప్రమాదమే అందుకు ఉదాహరణ. ఈ రెండు రోజులైనా అధికారులు మేల్కొంటే.. ప్రమాదాలను నివారించవచ్చు.. ప్రజల ప్రాణాలు కాపాడవచ్చు.

వెలుగు వెంటే చీకట్లు!



ఆదమరిస్తే.. జీవితాలే బుగ్గి



అమలాపురం మండలం రావులచెరువులో సంభవించిన విస్ఫోటనంతో కుప్పకూలిన భవనం (ఫైల్)



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జీవితమే ఒక దీపావళి. కొన్ని కుటుంబాల్లో వెలుగులు నింపితే.. మరికొన్ని కుటుంబాల్లో చిమ్మచీకట్లు నింపుతోంది. దీపావళికోసం అహర్నిశలు శ్రమించి బాణసంచా తయారు చేయడంలో నిమగ్నమయ్యే కుటుంబాల్లో ఏదైనా తేడా వస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది. ఈ ప్రమాదాల బారినపడ్డవారిలో మృత్యువాత పడే వారి సంఖ్యే ఎక్కువ. మరికొందరు అంగవైకల్యంతో బతుకు జీవుడా అని జీవించాల్సిన పరిస్థితులు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. వాటిలో ఏటా ఎక్కడో ఒకచోట అగ్నిప్రమాదం సంభవిస్తోంది. దీంతో అందులో పనిచేసే తయారీ నిర్వాహకులు, కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో మహిళల సంఖ్యా అధికంగానే ఉంటోంది. గత కొన్నేళ్ల కిందట అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెలలో బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. వారిలో ఇద్దరు దివ్యాంగులుగా మిగిలారు. క్షతగాత్రులు బతుకు జీవుడా అని జీవనం సాగిస్తున్నారు. అమలాపురం పట్టణం రావులచెరువులో గత నెల 16వ తేదీన సంభవించిన భారీ విస్ఫోటనంలో గొవ్వాల నాగలక్ష్మి(55) చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. వారిలో కొందరు ఇప్పటికీ అనారోగ్యంతోనే ఇబ్బందిపడుతున్నారు. ఒక్క కోనసీమ జిల్లాలోనే బాణసంచా ప్రమాదాల కారణంగా దశాబ్దకాలంగా విగతజీవులుగా మారిన వారి సంఖ్య భారీగానే ఉంది. అయితే కుటుంబ పోషణ నిమిత్తం బాణసంచా తయారీ కర్మాగారాల్లో సమీప ప్రాంతాలవారు పనులు చేస్తుంటారు. చాలీచాలని జీతాలతో కాలే కడుపులతోనే జీవిస్తున్నారు. తయారీ కేంద్రాల వద్ద సరైన భద్రతా ప్రమాణాలను యాజమాన్యాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు తలెత్తుతున్నాయని అగ్నిమాపకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. డబ్బున్నవారు దీపావళి పండుగను వేడుకగా చేసుకుంటుంటే పేద కార్మికులు మాత్రం పస్తులతో ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇక కోనసీమలోని వివిధ ప్రాంతాలకు తమిళనాడు రాష్ట్రం నుంచి భారీగా బాణసంచా దిగుమతులు జరుగుతున్నాయి. ఈ సామగ్రి విక్రయాలకే ఈ ప్రాంత వ్యాపారులు మగ్గుచూపుతున్నారు. కోనసీమ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే బాణసంచాకు సంబంధించి బాంబులు, సెర్‌లైట్లు, మతాబులు, టపాసులు వంటివి తయారుచేసి విక్రయిస్తున్నారు.

- ఉమ్మడి జిల్లాలో బాణసంచా ఫేమస్
- ఎక్కడికక్కడ తయారీ కేంద్రాలు
- అనధికారికమే ఎక్కువ
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరు
- ప్రతి ఏటా విషాదం..మామూలే!
- కన్నెత్తి చూడని అధికారులు
- తాజాగా ఏడిదలో ప్రమాదం

ప్రమాదాలు ఇలా..

- 2019 సెప్టెంబరు 30న జీ.మేడపాడు కెనాల్ రోడ్డులో ఒక బాణసంచా తయారీ సంస్థలో జరిగిన పేలుళ్లలో ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు.
- 2023 ఏప్రిల్ 5న పెదపూడిలో జరిగిన బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరికొందరు గాయపడ్డారు.
- రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో ఆంజనేయ ఫైర్‌వర్క్సులో రెండుసార్లు ప్రమాదాలు జరిగాయి. 1996 మే 1 జరిగిన ప్రమాదంలో కర్రి సత్యనారాయణ, ఆయన కుమారుడు కర్రి శ్రీనివాస్ మృతి చెందారు. తదుపరి మరో ప్రమాదంలో బొక్కా సత్తిబాబు అనే వ్యక్తి మృతి చెందాడు. 2003లో తోటపేటలో జరిగిన ప్రమాదంలో ప్రస్తుతం ఆంజనేయ ఫైర్ వర్క్సు యజమానిగా ఉన్న దవులూరి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి కోలుకున్నారు. అదేవిధంగా రామచంద్రపురం మండలం జువ్విపాడులో ఆనందరావు బాణసంచా తయారీ కేంద్రం వద్ద జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృత్యువాతపడ్డారు. అందులోమహిళలు కూడా ఉన్నారు. బిక్కవోలు మండలం తొస్సిపూడిలో 2023లో జరిగిన ప్రమాదంలో పెట్రోల్ బంక్ ధ్వంసమైంది.

బాణసంచాకు కుటుంబమే బలి

2022 ఫిబ్రవరిలో జరిగిన అగ్ని ప్రమాదంలో మండపేట పట్టణంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ముగ్గురు మృత్యువాతపడ్డారు.అన్నవరపు కోటేశ్వర రావు, కుమారుడు రవికుమార్ మృతిచెం దగా, కొద్దిరోజుల తర్వాత మరో ప్రమాదంలో కోటేశ్వరరావు పెద్ద కుమారుడు చంద్రరావు మృత్యువాతకు గురయ్యాడు. ఇక కోటేశ్వరరావు మనుమడు అయ్యప్ప రాజు, అతడి తల్లి కూడా ప్రమాదంలో కన్నుమూశారు.ఇలా కుటుంబమంతా మందుగుండు ప్రమాదంలోనే మరణించడం మరో విషాదం. అలాగే వారి వద్ద పనిచేసే ఇద్దరు కూలీలు కూడా రెండేళ్ల కిందట జరిగిన ప్రమాదంలో మరణించారు.

పదేళ్లయినా.. అందని సాయం

- వాకతిప్ప పేలుడుకు పదేళ్లు
- 18 మంది దుర్మరణం
- కూటమి ఆదుకోవాలని వినతి

కొత్తపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలో బాణసంచా కేంద్రంలో పదేళ్ల కిందట అక్టోబరు నెలలో సంభవించిన పేలుళ్లలో మొత్తం 18మంది దుర్మరణం పాలయ్యారు. వీరంతా వాకతిప్ప దళిత కాలనీకి చెందినవారు. బాణసంచా పేలుళ్లలో మృతిచెందిన కుటుంబాలకు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రూ.2లక్షల నగదు, స్థానిక విద్యుత్ ప్లాంటు యాజమాన్యం రూ.50వేలు, పలువురు దాతలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు మూలపేటలో సర్వే నెంబరు 41,42లో అరెకరం చొప్పున 9 ఎకరాల భూమి మంజూరు చేశారు. పేలుడు సంఘటనలో మృతిచెందిన 18మందిలో 12మంది మహిళలు వాకతిప్పకు చెందిన వారే. మిగిలిన ఆరుగురు నిదానందొడ్డి, కలవల దొడ్డికి చెందినవారు.అప్పట్లో అరెకరం భూమికి సంబంధించిన పట్టాలను అప్పటి మంత్రి అయ్యన్న పాత్రుడు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. పట్టాలు ఇచ్చాక అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీరికి ఆ భూమిని అప్పగించలేదు. దీంతో ఈ భూముల వ్యవహారం ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం భూమి అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వం పట్టాలిచ్చిందికానీ..భూమివ్వలేదు..



పేలుళ్లలో మృతిచెందిన 18 కుటుంబాలకు మూలపేట సెజ్ భూముల సమీపంలో ఒక్కొక్కరికి 50 సెంట్ల భూమిని కేటాయించారు. మంత్రి చేతుల మీదుగా పట్టాలిచ్చినా భూమిని అప్పగించలేదు. జగన్ సీఎం అయ్యాక పేదల ఇళ్ల స్థలాల పంపిణీకి 9 ఎకరాల భూమి ఇవ్వమని అప్పటి తహశీల్దార్ ఒత్తిడి తెచ్చారు. బాధితులు ఒక్కొక్కరికి 3 సెంట్ల భూమిచ్చి దానిలో ఇళ్లు కట్టించి ఇస్తామని భ్రమ కలిగించారు. మేము ఒప్పుకోకపోవడంతో అప్పటి నుంచి బాణసంచా బాధిత కుటుంబాలకు కేటాయించిన భూమి మాట పట్టించుకోలేదు.అప్పటి బాణసంచా ప్రమాదంలో తన భార్యవదిన, మరదలు, తమ్ముడు, మనవరాలు దుర్మరణం పాలయ్యారు. కూటమి ప్రభుత్వం బాణాసంచా బాధితులకు న్యాయం చేస్తుందని ఆశపడుతున్నాను. **- మసకపల్లి నాగేశ్వరరావు**

జనావాసాల మధ్య అనుమతులు ఇవ్వలేం

- నిబంధనల ప్రకారమే బాణాసంచా దుకాణాలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దీపావళి సామాగ్రిని విక్రయించే దుకాణాలు జనావాసాల మధ్య ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇవ్వలేమని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. నియమ నిబంధనల ప్రకారమే దీపావళిదుకాణాలకు అనుమతి ఇస్తామన్నారు.జనావాసాలకు దూరంగా విశాలమైన ప్రాంగణాల్లో ఏర్పాటుకు అనుమతి ఇస్తామన్నారు. పండుగను జిల్లావాసులు ఆనందంగా నిర్వహించుకోవాలనే లక్ష్యంతే జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

విమానాశ్రయంవల్ల నష్టపోతాం

- కలెక్టర్‌కు రైతుల వినతి

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నవరం జాతీయ రహదారి-16 బైపాస్ రోడ్డును చేర్చి 800 ఎకరాలు విమానాశ్రయంకోసం సేకరించే ప్రతిపాదనను విరమించుకోవాలని బెండపూడి, పీఈ చిన్నయిపాలెం రైతులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. దీనివల్ల తాము నష్టపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఇదే ప్రాంతంలో పుష్కర, పోలవరం కాలువల నిమిత్తం 475ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుందని, హైవే బైపాస్‌రోడ్డుకు 150ఎకరాలు తీసుకుందని, మళ్లీ 800 ఎకరాలు విమానాశ్రయానికి తీసుకుంటే రైతులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాకినాడలో బాణాసంచా దుకాణాల రగడ



కాకినాడ ఆర్డీవో కార్యాలయం వద్ద రోడ్డు మీద బైఠాయించి.. పడుకున్న టీడీపీ నాయకులు

- టీడీపీ కార్యకర్తల దుకాణం అనుమతి రద్దుపై పార్టీ శ్రేణుల ధర్నా
- కాకినాడ ఎంపీ ఉదయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- రోడ్డుపై పడుకుని నిరసన తెలిపిన టీడీపీ నేతలు

కాకినాడ సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడలో బాణాసంచా దుకాణాల రగడ తారాస్థాయికి చేరింది. ఈ వివాదం ముదరడంతో కాకినాడ ఆర్డీవో కార్యాలయంవద్ద రోడ్డు మీద పడుకుని టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టీడీపీ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ద్వారంపూడికి తొత్తుగా పనిచేస్తున్న కాకినాడ ఎంపీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ వివాదం టీడీపీ వర్సెస్ జనసేనగా మారింది. కాకినాడ సిటీ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అనుచరులైన టీడీపీ కార్యకర్తలు కాకినాడ మెయిన్‌రోడ్ టూటౌన్ సమీపంలో బాణాసంచా దుకాణం ఏర్పాటు చేశారు. కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అనుచరులు భానుగుడి సెంటర్‌వద్ద బాణాసంచా దుకాణం ఏర్పాటు చేశారు. టీడీపీ వర్గం ఏర్పాటు చేసిన దుకాణం రద్దీప్రదేశంలో ఉండడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీంతో అధికారులు ఈ దుకాణానికి అనుమతులు రద్దు చేశారు. కాగా ఎంపీ ఒత్తిడి మేరకే మెయిన్‌రోడ్‌లోని తమవర్గం బాణాసంచా దుకాణం అనుమతులు రద్దు చేశారని, దీనివెనుక ద్వారంపూడి ప్రమేయం ఉందని టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తూ భగ్గుమన్నారు. కాకినాడ ఎంపీ తీరుకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే అనుచరులు రోడ్డు మీద బైఠాయించారు. రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. రాత్రి 8గంటల వరకు ఇది కొనసాగింది. కాకినాడ నగరంలోని టీడీపీ శ్రేణులందరూ తరలి వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు.

కాకినాడ మెయిన్‌రోడ్డులో బాణాసంచా దుకాణానికి అనుమతులు రద్దు

- 'ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?' కథనానికి స్పందించిన అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్డులో దీపావళి సామాగ్రి దుకాణానికి అనుమతులు రద్దు చేశారు. 'ప్రమాదం జరిగితే.. బాధ్యత ఎవరిది?' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆ దుకాణానికి అనుమతి రద్దుచేసినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో టీడీపీ, జనసేన మధ్య విభేదాలు బయటపడ్డాయి. కాకినాడ పరిధిలో 128 దుకాణాలకు అనుమతులు ఇవ్వగా నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో ఒకదానికి అనుమతులు ఆపామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ఆ దుకాణం కాకినాడ మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేయడంవల్ల ట్రాఫిక్ సమస్య, ఇరువైపులా దుకాణాలు ఉండడంతో ఆపామని తెలిపారు.

అధికార పార్టీకి ఇది తగునా: రమణరాజు

సమస్య ఏదైనా రోడ్డెక్కి ట్రాఫిక్ స్తంభింపచేయడం మంచిది కాదని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ సామాజికవేత్త దూసర్లపూడిరమణరాజు అన్నారు.ఆర్డీవో కార్యాలయంవద్ద రోడ్డుపై టీడీపీ శ్రేణులు బైఠాయించడంపై కాకినాడసిటీ, రూరల్ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ ప్రజాహిత సమస్యలకు బాధ్యత వహించాలని, కూటమి శ్రేణుల సమస్యల్ని రోడ్డుపైకి తేవడం మంచిది కాదన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహించగా వివిధ సమస్యలకు సంబంధించి 428 అర్జీలు వచ్చాయి. జేసీ రాహుల్‌మీనా, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, డీపీఎం లావణ్య పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 52 అర్జీలు

కాకినాడ క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు స్థానికంగానే వారి సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 52మంది అర్జీదారులు ఎస్పీ నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌ను సోమవారం ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ స్పందించి పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

జిల్లావ్యాప్తంగా 386మంది రక్తదానం

కాకినాడ క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా 386మంది పోలీస్ సిబ్బంది, విద్యార్థులు సోమవారం రక్తదానం చేశారు. కాకినాడ, పెద్దాపురం, తుని ఏరియాల్లో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడలో 156మంది, పెద్దాపురం సబ్‌డివిజన్ పరిధిలో డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో 201మంది, తునిటౌన్ సీఐ ఆధ్వర్యంలో 29మంది మొత్తంగా 386మంది రక్తదానం చేశారు.అడ్మిన్ ఎస్పీ భాస్కర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోలీస్ సిబ్బంది



విల్లులా వంగుతారు!

జిమ్నాస్టిక్స్‌లో రాణిస్తున్న క్రీడాకారులు





జాతీయస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులతో శిక్షకుడు సురేష్

విల్లులా వంగగలరు.. పక్షిలా ఎగరగలరు.. చిరుతలా దూకగలరు.. శరీరాన్ని ఎటువైపైనా తిప్పగలరు.. వీళ్లే జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు. వీళ్లంతా విభిన్న మార్గం ఎంచుకున్నారు. అందరిలా కాదు.. తాము ప్రత్యేకం అని నిరూపించుకునే మార్గంలో పయనిస్తున్నారు. మెరికల్లాంటి ఈ క్రీడాకారులు ఎక్కడో కాదు మన దగ్గరే ఉన్నారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిల్లో తమ సత్తా చాటి ఒలింపిక్స్‌లాంటి వేదికలపై తమకంటూ ఒక గుర్తింపు ఉండాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నారు. విద్యతోపాటే తమకు ఆసక్తికరమైన జిమ్నాస్టిక్స్ రంగంలో నైపుణ్యం సాధిస్తున్నారు.. దీనికి అనుగుణంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ నైపుణ్యం కలిపి వీళ్లంతా ఉన్నత శిఖరాలు అధిరోహించే దిశగా అడుగులు వేస్తున్నారు.

కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఉన్న జిమ్నాస్టిక్స్ ఆడిటోరియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఇప్పటికే జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిల్లో ప్రతిభ కనబర్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో వీరంతా కఠోర శ్రమ చేస్తున్నారు. విజయాన్ని సొంతం చేసుకోవాలన్న తపన ఈ క్రీడాకారులు ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది.

ఎల్‌కేజీ నుంచే శిక్షణ

రాష్ట్రంలోనే అతిపెద్ద జిమ్నాస్టిక్ ఆడిటోరియం కాకినాడలో ఉంది. గుంటూరు తర్వాత రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు జిమ్నాస్టిక్స్‌లో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ప్రారంభంలోనే వాళ్ల శరీరాకృతి ఆధారంగా దేనిలో రాణిస్తారో గుర్తించి వాటిలో శిక్షణ ఇస్తారు. తెల్లరేషన్‌కార్డు ఉండి ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలబాలికలకు ఇక్కడ శిక్షణ పూర్తిగా ఉచితం. మిగతావారికి నెలకు రూ.500 ఫీజు చెల్లించి శిక్షణ తీసుకోవచ్చు. వారి సామర్థ్యాన్ని బట్టి ఎంపిక చేసి కేటగిరీల వారీగా శిక్షణ ఇస్తామని శిక్షకుడు సురేష్ తెలియజేశారు. వీరంతా ఒకపక్క చదువుపాటు జిమ్నాస్టిక్స్ శిక్షణలోను పాల్గొంటూ తమ నైపుణ్యాలను చాటుకుంటున్నారు. - ఆంధ్రజ్యోతి/కాకినాడ అర్బన్

జాతీయస్థాయిలో రాణించాలని ఆశ



నేను ఐడియల్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. ప్రస్తుతం ఆ పోటీలకు రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి మంచి పేరు తీసుకురావాలన్నదే నా ఆశయం.- జి.కావ్యసాయిశ్రీ

మంచిపేరు తీసుకు రావాలని ఉంది



అది విశాఖ జిల్లా గాజువాక. నేను కాకినాడ శ్రీచైతన్యలో ఇంటర్ చదువుతున్నా. రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించా. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నా. తద్వారా తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉంది.

- హిమవర్షిణి



జిమ్నాస్టిక్స్‌పై ఆసక్తి



కాకినాడ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నా. చిన్నప్పటి నుంచి జిమ్నాస్టిక్స్‌పై ఆసక్తితో ఇక్కడే శిక్షణ పొందుతున్నా. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నన్ను అందరూ ప్రోత్సహిస్తున్నారు. జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించాలన్నదే లక్ష్యం. - శివగణేష్ వీరబాబు

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



నేను కాకినాడ శ్రీప్రకాష్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో 4 బంగారు పతకాలు సాధించా. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి మంచి ఉద్యోగం సాధించాలనుకుంటున్నా. - మధులత

వయస్సుతో సంబంధంలేని సొరియాసిస్

చర్మంపై ఎర్రటి దద్దుర్లు నిర్లక్ష్యం చేయొద్దు... తగిన జాగ్రత్తలతో అదుపులో వ్యాధి





(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం అర్బన్)

సొరియాసిస్.. వయసుతో సంబంధం లేకుండా ఇది వస్తుంది. దీర్ఘకాలికమైన రోగ నిరోధక శక్తిలో వచ్చే మార్పులతో సొరియాసిస్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యవంతుల్లో చర్మం ఉపరితలం కింద కొత్త కణాలు నిరంతరాయంగా తయారవుతుంటాయి. 24 నుంచి 30 రోజులకు ఇవి బయటకు వస్తాయి. కానీ ఈ వ్యాధి అదుపు తప్పితే చర్మకణాలు మూడు, నాలుగు రోజులకే వేగంగా తయారై బయటకు వస్తాయని, దీనివల్ల చర్మం మందంగా తయారవడంతోపాటు దురద, పొలుసులు ఊడుతాయని చెబుతున్నారు. సొరియాసిస్ ముఖ్యంగా మోచేయి వెనుకభాగం, మోకాలి వెనుకభాగం, తల, వీపు ముఖం, చేతులు, పాదాలకు ఈ వ్యాధి వస్తుంది. సరైన చికిత్స తీసుకోకపోతే దీర్ఘకాలం బాధించే మొండి వ్యాధిగా మారుతుంది. చర్మం ఎర్రగా దద్దుర్లుగా వచ్చి దానిపై తెల్లటి పొట్టుగా వస్తుంది. దీన్నే సొరియాసిస్ అంటారు. సొరియాసిస్‌లో వేర్వేరు రకాలు ఉంటాయి. కొంతమందికి తలలోనే ఉంటుంది. కొంతమందికి శరీరం అంతా వస్తుంది. కొంతమందికి జాయింట్ పెయిన్స్ ఉంటాయి. మరికొంతమందికి పొట్టురాలడం, దురద, జుట్టు రాలడం వంటివి ఉంటాయి. ఇవన్నీ సొరియాసిస్ ప్రథమ లక్షణాలు. కొంతమందిలో చర్మంలో మంటలు, గోకిన కొద్దీ దురద వస్తుంది. మానసిక ఒత్తిడి కూడా దీనికి ఒక కారణమే. జన్యు సంబంధిత లోపాలు కారణం కావొచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే సొరియాసిస్ అంటువ్యాధి కాదు. చాలామందికి దీనిపై దురభిప్రాయం ఉంది. అయితే ఇది బీపీ, షుగర్‌లా ఒక జబ్బు మాత్రమే. సొరియాసిస్‌ను కంట్రోల్ చేయగలం కానీ, పూర్తిగ నయం చేయలేం అని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే దీన్ని అదుపులో ఉంచడానికి చక్కటి మందులు ఉన్నాయి. అదే విధంగా ఒత్తిడిని అధిగమించడం ద్వారా కూడా కొంతవరకు అదుపులో పెట్టుకోవచ్చు.

నేడు సొరియాసిస్ డే

● కారణాలు అనేకం..

ప్రొటీన్స్ తగినంత లేకపోవడం, పౌష్టికాహార లోపం, కొన్ని రకాల సబ్బులు, హార్మోన్ల సమస్యల వల్ల రక్తప్రసరణ తగ్గినప్పుడు, శరీర కణాలకు అవసరమైన ఆహారం లభించకపోవడం, వాతావరణ మార్పులకు శరీరం అలవాటు పడకపోవడం, ఇష్టానుసారం మందులు వాడకం వంటి కారణాలతో సొరియాసిస్ రావొచ్చు. దీన్ని చిన్న జబ్బు అని తీసేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి. సరైన నివారణ చర్యలు పాటించడం ద్వారా చాలావరకు ఉపశమనం పొందవచ్చు.

● అదుపులో ఉంచాలంటే..

పొడి చర్మానికి ఇంట్లో దొరికే కొబ్బరి నూనె ఎక్కువసార్లు రాసుకోవాల్సి ఉంటుంది. కాళ్లకు సాక్సు వేసుకోవాలి. ఎక్కువ డిటర్జెంట్లు వాడకూడదు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సొరియాసిస్‌ను చర్మం, మాడు, గోళ్ల వంటి వాటిని పరీక్షించి నిర్ధారిస్తారు. ఇది దీర్ఘకాలికమైంది.

● ఏం జాగ్రత్తలు తీసుకోవాలి..

సొరియాసిస్ తీవ్రతను తగ్గించడానికి టాబ్లెట్లు, క్రీమ్‌లు ఉంటాయి. వీటిని వైద్యుల పర్యవేక్షణలో ఒక కోర్సులా వాడాలి. మందులు వేసుకోవడంతోపాటు ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవాలి. పండ్లు, కూరగాయలు, కొవ్వు తక్కువగా, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఆకుపచ్చని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఆల్కహాల్ తగ్గించుకోవాలి. ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉండాలి. సొరియాసిస్ కారణంగా హార్టు ఎటాక్, షుగర్ త్వరగా వస్తాయి. ఇది కేవలం స్కిన్ డిసీజ్ అనుకోవద్దు.. మెటబాలిక్ సిండ్రోమ్ అని వైద్యులు స్పష్టంచేస్తున్నారు.



స్వర్ణం కొంటే.. సిరుల పంట!

- నేడు ధనత్రయోదశి.. గోల్డ్ కొనుగోళ్లను ప్రభావితం చేస్తున్న నమ్మకం
- కార్పొరేట్ సంస్థలతో ఉత్తరాది నుంచి వచ్చిన సెంటిమెంట్ ఇది
- అక్షయ తృతీయ, వరలక్ష్మి వ్రతాలకూ మనకు అదే సెంటిమెంటు
- బంగారం ధరలు చూస్తే ఆకాశంలో.. 22క్యా. గ్రాము ధర రూ.7,315

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)



పండగలంటేనే అందరికీ సంతోషం. ఆరోజు ఏదొకటి మంచి పనిచేసుకోవాలని భావిస్తుంటారు. పండగలలో ధనానికి సంబంధించిన పండగలంటే మర్చిపోలేని పండగే. దీపావళికి ముందు వచ్చే ధనత్రయోదశి అంటే మహిళలకు భలే ఇష్టం. ఈరోజు బంగారం కొనుగోలు చేస్తే రాబోయే రోజుల్లో బాగా ఐశ్వర్యంతో వృద్ధి చెందుతామనే నమ్మకం ఉంది. వాస్తవానికి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ అక్షయ తృతీయ రోజు బంగారం కొనడానికి ప్రాధాన్యత ఇస్తారు. అలాగే వరలక్ష్మి వ్రతం రోజున బంగారం కొనుక్కోవాలనే సెంటుమెంటు బాగా ఉంది. కనీసం బంగారపు లక్ష్మీదేవి రూపు అయినా కొనాలని ప్రతి మహిళా ఆరాటపడతారు. గత కొన్నేళ్లుగా బంగారం వ్యాపారం కార్పొరేషన్ సంస్థల చేతులలోకి వెళ్లి పెద్ద షోరూమ్‌లన్నీ నగరాలు, పట్టణాలు, చివరకు గ్రామాల్లోకి కూడా ప్రవేస్తున్న సంగతి తెలిసిందే. ధనత్రయోదశి అనే సెంటిమెంట్‌ను ఈ సంస్థలే తెలుగు ప్రాంతాల్లో విస్తృతవ్యాప్తిలోకి తెచ్చాయని స్థానిక వ్యాపారుల కథనం. ఉత్తరాదిలో ఇటువంటి సెంటిమెంట్ ఎక్కువగా ఉందనేది వారి వాదన. దాంతో ఇక్కడ వ్యాపారం వృద్ధి చెందడం కోసం, ప్రతీ ఒక్కరూ ఏడాదికి కనీసం రెండుసార్లయినా బంగారం కొంటే మంచిదనే సెంట్‌మెంట్ వ్యాప్తి చెందింది. అందుకే ఎండాకాలంలో అక్షయ తృతీయ, దీపావళికి ముందు ధనత్రయోదశి రోజున బంగారం కొనడం ఆనవాయితీగా మారింది. గతంలో ఎప్పుడు డబ్బు ఉంటే అప్పుడు కొనుక్కునేవారు. తర్వాత పండగలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు కొనుగోలు చేసేవారు. ఇక ధనత్రయోదశి, అక్షయ తృతీయ రోజుల్లో కొనుగోలు చేస్తే సంవత్సరం అంతా కొంటామనే సెంటిమెంట్ ప్రచారంలోకి రావడం వల్ల దానిని నమ్మిన ప్రజలు బంగారం కొనడానికి ఆసక్తి చూపిస్తున్నారు. బంగారం కొనలేని వారు ఏదొక చిన్న వస్తువునైనా కొనుగోలు చేయడం కూడా ఆనవాయితీగా మారిందని చెబుతున్నారు. ఇక ధనత్రయోదశి అంటే ఆయుర్వేద విజ్ఞానానికి ఆరాధ్యం దైవం ధన్వంతరి. ఆయన పుట్టినరోజును ధనత్రయోదశిగా జరుపుకుంటారు. ధన్వంతరిని ధ్యానిస్తే ఆయురారోగ్య ఐశ్వర్యాలు జీవితకాలం ఉంటాయని చెబుతుంటారు. పైగా ధనత్రయోదశి అనేది కొత్త దనానికి ఆరంభంగా చెబుతారు. అందువల్ల ఈరోజు కొత్త వస్తువులను కొనుగోలుచేయడం మంచిదంటారు. ఇక ధనత్రయోదశి నాడు లక్ష్మీదేవికి, కుబేరుడు కూడా పూజ చేస్తారు. ఇక బంగారం కొనుగోలు చేస్తే సాక్షాత్తూ మహాలక్ష్మీదేవి ఇంట్లో తరలివస్తుందనేది ఓ సెంటిమెంట్‌గా అందరూ భావిస్తారు. అందుకే ఏదోవిధంగా బంగారం కొనుగోలు చేయడానికి అందరూ ప్రయత్నిస్తారు. వాస్తవానికి ఈ పండుగ హిందువులకు సంబంధించినది అయినా, బంగారం అన్ని వర్గాలు కొనుగోలు చేయడం గమనార్హం. ప్రస్తుతం బంగారం ధరలు ఎక్కువగా ఉండడం వల్ల చాలామంది ఒకే రోజు కొనుగోలు చేసుకోకపోవచ్చు. అందువల్ల చాలా దుకాణాల్లో స్కీమ్‌లు అందుబాటులో ఉన్నాయి. నెలకు ఇంతని చెల్లిస్తే, మొత్తం వాయిదాలు అయిన తర్వాత బంగారం ఇస్తారు. ఒక రూపాయితో డిజిటల్ పేమెంట్ చేసి, ఆయా వ్యక్తుల పేర్ల మీద వాలెట్ ప్రారంభించే అవకాశం కూడా ఉంది.

● బాగా పెరిగిన బంగారం

బంగారం అంటే ఇష్టం లేనివారు ఉండరు. ఆడ, మగ తేడా లేకుండా ఎవరైనా బంగారం అంటే ఇష్టపడతారు. బంగారాన్ని కేవలం ధరించడానికే కాకుండా పెట్టుబడిగా కూడా పరిగణిస్తున్నారు. కానీ కొన్ని రోజులుగా బంగారం ధరలు బాగా పెరిగిపోయింది. సోమవారం రాజమహేంద్రవరం మార్కెట్‌లో 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.7,315గా ఉంది. ఇది ఆదివారం రూ.7360గా ఉంది. అంటే సోమవారం రూ.45కు తగ్గింది. ఇలా బంగారం ధరలు రోజూ మారుతున్నాయి. అటు 24 క్యారెట్ బంగారం ధర 1 గ్రాము రూ.7,980గా ఉంది. ఈ నేపథ్యంలో బంగారం కొనుగోళ్లు ఏమేరకు ఉంటాయో చూడాలి.






స్వామివారి కల్పవాహన సేవమహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.. వాడపల్లి బ్రహ్మోత్సవ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

స్వామివారి తోమాలసేవ

ఎనిమిదవ రోజు బ్రహ్మోత్సవాలలో మహాసుదర్శన హోమం.. ఉభయ దేవేరులతో ఘనంగా కల్పవాహన సేవ



స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకం



వసంతం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఆత్రేయపురం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఎనిమిదవ రోజు ఘనంగా జరిగాయి. వేకువజామునే స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వర్ణశోభితుడిని చేశారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అష్టకలశారాధన, మహస్నహపనము, ప్రధాన హోమాలు, మహాసుదర్శన హోమం నిర్వహించారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ తోమాల సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు - కనక దుర్గా చేతుల మీదుగా నిర్వహించారు. ఉదయం శ్రీవారు ఉభయదేవేరులతో కల్పవృక్ష వాహన సేవను కేరళ వాయిద్యాలు, అశేష భక్తజన గోవిందనామస్మరణల నడుమ ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేదపండితులు చూర్ణోత్సవ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. తీన్‌మార్ వాయిద్యాలు, భరతనాట్యం, కోలాట ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి కల్కి అలంకరణలో శ్రీవారు అశ్వవాహనంపై కొలువుతీరారు. వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ నడుమ అశ్వవాహన సేవ కన్నుల పండుగగా నిర్వహించారు. శ్రీవారు తిరువీధులలో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శ్రీవారి వాహన సేవలో పాల్గొన్నారు. విద్యుత్ వెలుగులు, బాణసంచా కాల్పుల నడుమ వాహనసేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ముదునూరి వెంకట్రాజు-సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం- మంగాదేవి దంపతులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో ...

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు మంగళవారం స్వామివారికి మహాపూర్ణాహుతి, చక్రస్నాన మహోత్సవం సాయంత్రం, మహాఆశీర్వచనం రాత్రి ఏకాంత సేవతో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్టు ఉపకమిషనరు చక్రధరరావు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.



ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు దాడికి పాల్పడడంతో పోలీస్ స్టేషన్ వద్ద గుమిగూడిన జనం

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ దౌర్జన్యం

టార్పాలిన్ కప్పకుండా ఇసుక రవాణా.. ఆపై అతివేగం

ప్రశ్నించిన ద్విచక్రవాహదారుడిని ట్రాక్టర్‌తో ఈడ్చుకెళ్లిన డ్రైవర్

సీతానగరం, అక్టోబరు 28: టార్పాలిన్ లేకుండా, అధిక వేగంగా నడపడమేంటని ప్రశ్నించిన ద్విచక్రవాహనదారుడిపై ట్రాక్టర్ డ్రైవర్ అమానుషంగా ప్రదర్శించాడు. అతడిని ట్రాక్టర్‌తో సహా ఈడ్చుకెళ్లాడు. స్థానికులు రక్షించడంతో ప్రాణాపాయం తప్పింది. సీతానగరం గ్రామానికి చెందిన కోడేబత్తుల జగన్ మోహన్‌రావు రాత్రి 7.15ని ప్రాంతంలో తన సొంతూరైన రామచంద్రపురం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. డిగ్రీ కళాశాల వద్దకు వచ్చేసరికి అధిక వేగంగా గుంతలు కూడా చూడకుండా ఒక ఇసుక ట్రాక్టర్ వెళుతోంది. టార్పాలిన్ లేకపోవడంతో ఇసుక గతుకులకు ఎగిరి వెనుక వస్తున్న వాహనదారులపై పడుతోంది. తనపై కూడా పడడంతో సహనం కోల్పోయిన జగన్‌మోహన్‌రావు ట్రాక్టరు ఆపి టార్పాలిన్ కూడా లేకుండా అంత స్పీడ్ ఎందుకు వెళ్తున్నారు? ఇసుక కళ్లల్లో పడుతోందని నిలదీశాడు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ 'ఇది నా సొంతూరు, నేను ఏం చేసినా అడిగేవాడు లేడు అంటూ దౌర్జన్యానికి దిగాడు. వెనుక వస్తున్న మరికొన్ని ట్రాక్టర్ల డ్రైవర్లు కూడా అడ్డువస్తే మీద నుంచి పోనిస్తామంటూ బెదిరించి వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే జగన్ మోహనరావు ఆపిన ట్రాక్టర్ డ్రైవర్ అతడిని తోసుకుంటూ ముందుకు పోనిచ్చాడు. దీంతో చేసేది లేక జగన్‌మోహనరావు ట్రాక్టరుకు వేలాడాడు. అయినా ఆపకుండా పోనిస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు చూసి ఆపారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం ఆయన సీతానగరం పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. కాగా ఇటీవల ట్రాక్టర్ డ్రైవర్లకు, యజమానులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. అయినప్పటికీ వాటిని ట్రాక్టర్ డ్రైవర్లు బేఖాతరు చేస్తున్నారు. తహశీల్దార్ సర్వేచేసి మక్కుల వేసిన చోట తవ్వకాలు జరపాలని, మంగళవారం నుంచి ఇసుక తోలుకోవచ్చని ఎమ్మెల్యే చెప్పినా సోమవారం రాత్రి నుంచి విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారు. పైగా డ్రైవర్లు కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అధికారులు స్పందించి వీరిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

స్వగ్రామంలో 'గయ్యాళి అత్త' సూర్యకాంతం జయంతి


సూర్యకాంతం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సామర్లకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి, గయ్యాళి అత్తగా పేర్గాంచిన సూర్యకాంతం జయంతిని ఆమె స్వగ్రామమైన కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు వృద్ధుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సూర్యాకాంతం చిత్రపటానికి ఇన్‌చార్జి సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వందేళ్ల క్రితం జన్మించి చలన చిత్ర రంగంలో విశిష్ట స్థానం సంపాదించుకుని తమ గ్రామానికి ఎంతో ప్రాధాన్యం తెచ్చారన్నారు. నానాజీ, మలిరెడ్డి సూరిబాబు, మసిముక్కల ప్రసాద్, ఇమ్మిడిశెట్టి సూర్యనారాయణ, గంగాబత్తుల బాబులు, పంచాయతీ కార్యదర్శి శేఖరరెడ్డి, వీఆర్వో సంజీవరావు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు విలువైన మందుగుండు సామగ్రి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి

రాజానగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన దీపావళి మందుగుండు సామగ్రిని రాజానగరం పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు శానిటోరియం సమీపంలో జనావాసాల చెంతన రూ.2 లక్షలు విలువైన దీపావళి మందుగుండు సామగ్రి నిల్వ చేసినట్టు అందిన సమాచారం మేరకు దాడి చేశారు. సంబంధిత యజమాని లైసెన్సు కలిగి ఉన్నాడు. అయితే జనావాసాల్లో ప్రమాదకరంగా భావించి తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని రాధేయపాలెం సమీపంలోని గొడౌన్‌కు తరలించామని రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ చెప్పారు. యజమానికి నోటీసు జారీ చేసినట్టు ఎస్ఐ మనోహర్ వివరించారు.


పవిత్రాలను తీసుకొస్తున్న సహాయ కమిషనరు సత్యనారాయణరాజు, ఉత్సవాల విశిష్టతను వివరిస్తున్న అర్చకస్వామి, శాంతి కల్యాణం

అప్పనపల్లిలో ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

మామిడికుదురు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలతిరుపతిగా పేర్గాంచిన అప్పనపల్లిలో బాలబాలాజీ స్వామి పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం తొలి హారతి ఇచ్చారు. అనంతరం ఉభయ దేవేరులకు సహస్రధార అభిషేకం, చతుస్థానార్చనలు, పవిత్ర అవరోహణం, వైకుంఠ పాశ్వ హవనం, మహా పూర్ణాహుతిలను వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు పవిత్రాలను శిరస్సున పెట్టుకుని తోడ్కొని వచ్చారు. స్వామివారికి ఏకాదశ ఫల రస స్నపన సహిత అష్టోత్తర శత కలశ స్నపన తిరుమంజనాన్ని ఘనంగా జరిపారు. కంచి కామకోటి పీఠం నాదస్వర పాఠశాల విద్యార్థుల నాదస్వర స్వరార్చన భక్తులను ఆకట్టుకుంది. రాత్రి శ్రీపుష్పయాగం, మహదాశీర్వచనం, రుత్విక్కులకు సన్మానంతో ఉత్సవాలు ముగిశాయి. పవిత్రోత్సవాలు నిర్వహించడం వల్ల కలిగే ప్రయోజనాలను, శాంతి కల్యాణం విశిష్టతను అర్చకులు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రాణాలు తీసిన అతి వేగం

డివైడర్‌ని ఢీకొట్టి ఇద్దరు యువకుల మృతి

కాకినాడ రూరల్ రమణయ్యపేట మార్కెట్ సమీపంలో దుర్ఘటన


డివైడర్‌ను ఢీకొట్టి మృతి చెందిన హరిబాబు, అభినంద్ (పాత చిత్రాలు)

సర్పవరం జంక్షన్, అక్టోబరు 28: వారిద్దరూ స్నేహితులు... ఒకరు తండ్రి మృతి చెందగా అన్నీ తానై తల్లి రెక్కల కష్టంతో ఇంటర్ దాకా చదివి ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మరొకరు డిగ్రీ పూర్తి చేసి తండ్రి స్వీట్స్ వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉంటున్నారు. మేనకోడలు పుట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని స్నేహితులకు పార్టీ ఇచ్చి ఆనందంగా గడిపిన తర్వాత ఇంటికి వెళ్లే క్రమంలో మితిమీరిన వేగంతో బైక్ నడపడంతో వేగాన్ని నియంత్రించలేక అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ని ఢీకొన్నారు. ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనికి సంబంధించి సర్పవరం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి...

కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన పాలపర్తి అభినంద్ (20), మజ్జి హరిబాబు (20) స్నేహితులు. మేనకోడలు పుట్టిన ఆనందంలో అభినంద్ ఆదివారం రాత్రి ఏపీఐఐసీ కాలనీలో సుమారు 10 మంది స్నేహితులకు పార్టీ ఇచ్చాడు. రాత్రి 10 నుంచి అర్ధరాత్రి 12.30 గంటల వరకు ఆనందంగా గడిపారు. అ తర్వాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో అభినంద్, హరిబాబు స్నేహితుడి బైక్‌పై గంగరాజునగర్ నుంచి సర్పవరం జంక్షన్ వైపు బయల్దేరారు. రమణయ్యపేట మార్కెట్ సమీపంలోని శ్మశానవాటిక వద్దకు వచ్చేసరిగా వేగాన్ని నియంత్రించలేక డివైడర్‌ని ఢీకొట్టారు. ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. తీవ్ర రక్తస్రావంతో హరిబాబు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అభినంద్‌ను సమీపంలోని సిటీ ఆసుపత్రికి తరలించగా కొద్దిసేపటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వారి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మేనకోడలు పుట్టిందన్న ఆనందంలో బయటకు వెళ్తున్నామని చెప్పిన తన కుమారుడికి ఇలా జరిగిందంటూ అభినంద్ తండ్రి త్రిమూర్తులు, కుటుంబ సభ్యులు రోదించాడు. తండ్రి మృతితో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో చేతికి అందివస్తాడనుకుంటున్న క్రమంలో ఇలా మృతి చెందడంతో హరిబాబు తల్లి కన్నీరుమున్నీరైంది.

విషయం తెలిసిన వెంటనే సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో సంఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. అభినంద్ అన్నయ్య శివసత్యసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాలకు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మద్యం మత్తులో వేగాన్ని నియంత్రించలేకే డివైడర్‌ని ఢీకొట్టి యువకులు మృతి చెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. హెల్మెట్ ధరించి ఉంటే గాయాలతో బయటపడే వారంటున్నారు.


క్రీడా జ్యోతి వెలిగిస్తున్న డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్

రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం

కాకినాడ అర్బన్, అక్టోబరు 28: రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 విభాగాల్లో 68వ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తుండగా వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోటీలను డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి కేవీ సత్యనారాయణ, టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్‌కుమార్, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కె.నూకరాజు, టీవీఎస్ రంగారావు, ఎస్కే బాబు, జి.సునీల్ పాల్గొన్నారు.


అరెస్టు చేసిన వారి వివరాలు తెలుపుతున్న పిఠాపురం సీఐ, ఎస్ఐ... స్వాధీనం చేసుకున్న గంజాయి

ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణా

88 కిలోలు స్వాధీనం...

నలుగురు యువకులు అరెస్టు

పిఠాపురం, అక్టోబరు 28: ఏజెన్సీ నుంచి అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసులు స్వాధీనం చేసుకుని, నలుగురు యువకులను అరెస్టు చేశారు. సోమవారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ వెల్లడించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి నర్సీపట్టణం, రౌతులపూడి, పిఠాపురం మీదుగా కాకినాడకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారంతో కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్, పోలీసులు పిఠాపురం బైపాస్‌లో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రాపర్తి కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా... రాపర్తి గ్రామం వైపు నుంచి పల్సర్ బైక్‌పై ఒక వ్యక్తి పైలట్‌గా, వెనుక ఆటో వస్తుండగా పోలీసులను చూసి పరారయ్యే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని పట్టుకుని ఆటోలో తనిఖీ చేయగా మూటల్లో ఉన్న 88 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగిలి మణికంఠరాజు (23), అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం బలపం పంచాయతీ కుడుములు గ్రామానికి చెందిన గబులంగి మునిరాజు (20), కోరుకొండ గ్రామానికి చెందిన మామిడి సన్యాసిరాజు (23), చౌడపల్లి పంచాయతీ ఈదులబయలు గ్రామానికి చెందిన కొర్రా రాము(20)లను అరెస్టు చేశారు. గంజాయితో పాటు బజాజ్ పాసింజర్ ఆటో, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు.

సెంట్రింగ్ పనులకు వెళ్లి...

గంజాయి స్వాధీనం ఘటనలో ప్రథమ నిందితుడైన మణికంఠరాజు ఏజెన్సీ చింతపల్లి చుట్టపక్కల ప్రాంతాల్లో సెంట్రింగ్ పనులను చేస్తూ అక్కడ గంజాయి అమ్మేవారితో పరిచయాలు పెంచుకున్నాడు. గంజాయి కొనుగోలు చేసి చుట్టపక్కల ప్రాంతాల్లో విక్రయిస్తూ వ్యాపారం సాగిస్తున్నాడు. ఇదే రీతిలో ఏజెన్సీలోని కొందరు యువకులతో ముఠాగా ఏర్పడి కొంతకాలం గం జాయి అక్రమ రవాణా నిర్వహిస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. మణికంఠ రాజుపై సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్, ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్, గాజువాక ఎక్సైజ్ స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నాయి.


పులి రోడ్డుపైకి వచ్చిన అటవీ మార్గం ఇదే...

మన్యం పులి

రోడ్డు దాటుతుండగా చూసిన వీఆర్ పురం వాసి

వివరాలు సేకరిస్తున్న అటవీ, పోలీసు అధికారులు

భయందోళనలో కూనవరం మండల ప్రజలు

కూనవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూనవరం మన్యంలో అడుగుపెట్టిన పులి అటు అధికారులకు, ఇటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గిరిజన గ్రామాల ప్రజలు సాయంత్రం ఆరు అయ్యిందంటేనే భయాందోళన చెందుతున్నారు. ఆదివారం లింగాపురం పరిధిలో వీఆర్ పురం వాసులకు పులి ప్రత్యక్షంగా కనిపించడంతో ఈ భయం మరింత ఎక్కువైంది. పులిని చూసిన వీఆర్ పురానికి చెందిన బొర్రా సూరిను అటు పోలీసులు, ఇటు అటవీ శాఖాధికారులు పిలిపించి పులి ఆచూకీ వివరాలు తెలుసుకున్నారు. తాను కారులో వస్తుండగా పులి రోడ్డు దాటి అడవిలోకి వెళ్లినట్టు సూరి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు. గత కొన్ని రోజులుగా పులి కూనవరం రేంజ్ పరిధిలోనే తిరుగుతోంది. ఇటీవల రెండు పశువులపై దాడి చేసింది. మొదటి దాడిలో ఓ లేగదూడను చంపి రక్తం తాగి వదిలేసి వెళ్లిపోయింది. రెండవ దాడిలో మరో పశువును చంపి పూర్తిగా తినేసి వెళ్లిపోయినట్టు సమాచారం. మరోసారి రాత్రి వేళలో కూనవరం-చింతూరు మధ్య రాకపోకలను నిలిపివేశారు. అటు పోలీసులు, ఇటు అటవీ శాఖాధికారులు అప్రమత్తమయ్యారు.


పులిని చూశానని చెప్తున్న సూరి

రాత్రివేళ బయటకు రావద్దు

డీఎఫ్‌వో బబిత



పులి సంచరిస్తోందన్న ప్రచారం నేపథ్యంలో రాత్రివేళ ప్రజలెవరూ బయటకు రావొద్దు. పులి అడుగుజాడలు కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వడం. పులి కనిపిస్తే వీడియోలు కానీ, ఫొటోలు కానీ తీయొద్దు. రాత్రివేళ ప్రయాణాలు చేయవద్దు. రైతులకు రాత్రిళ్లు ఇచ్చే వ్యవసాయ కరెంటును నిలిపివేసి పూర్తిగా పగలు ఇచ్చేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

పులి దాడి ప్రచారం అవాస్తవం

వదంతులు నమ్మొద్దు: సీఐ కన్నపరాజు

ఎటపాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూనవరం మండలం లింగాపురం సమీపంలో రహదారిపై చింతూరు నుంచి కూనవరం వస్తున్న కారుపై పులి దాడి చేసిందనే ప్రచారం అవాస్తవమని సీఐ కన్నపరాజు పేర్కొన్నారు. పులి కారుపై దాడి చేసిందనే వదంతులపై ఆయన స్పందిస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పులి రహదారి పక్కన అరుస్తూ కన్పించిందని, కారుపై ఎటువంటి దాడి చేయలేదన్నారు. తప్పుడు వదంతులతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయందోళన చెందుతున్నారన్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత బయటకు రావద్దని, పులి సంచారం ఉన్న ప్రాంతాలకు పశువులను మేతకు తోలుకెళ్లొద్దని కూనవరం మండల ప్రజలకు సూచించారు. వేటగాళ్లు ఆటవీలోకి వెళ్లవద్దని సూచించారు. ఆటవీశాఖ అధికారులు పులి కదలికలపై దర్యాప్తును ముమ్మరం చేస్తున్నారని చెప్పారు.



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

'ప్రణాళికలు రూపొందించుకోవాలి'

సామర్లకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు రానున్న ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి అభివృద్ధి జరగాలన్నా ముందుగా ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని ఈటీసీ ఆవరణలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లాలకు చెందిన డీపీఎంలు, ఎంపీడీవోలు, డ్వామా పీడీలు, సీఈవోలు, డీఆర్డీఏ పీడీలు, ఈవోపీఆర్డీలకు రెండో బ్యాచ్ శిక్షణ తరగతులు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఏపీఎస్ఆర్డీ జాయింట్ డైరెక్టర్ రమణ, డీఎల్డీవో కేఎస్ఎన్ ప్రసాద్.. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. సుమారు 130 మంది అధికారులు హాజరు కాగా వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు అంజనేయులు, శ్రీనివాసరావు, చక్రపాణి, నిహారిక వివిధ అంశాలపై శిక్షణనిచ్చారు.

రేపు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కిస్తామని అన్నవరం దేవస్థానం అధికారులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విధులు కేటాయించిన సిబ్బంది డ్రెస్‌కోడ్‌తో పాల్గొనాలని కోరారు. నవంబరు 2న కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో కార్తీక మాస ఆదాయం ప్రత్యేకంగా నెలలో రెండు పర్యాయాలు లెక్కిస్తారు.

2న రాజమహేంద్రవరంలో

ఉమ్మడి జిల్లా మాదిగ, ఉప కులాల సదస్సు

కాకినాడ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2న రాజమహేంద్రవరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాదిగ, ఉపకులాల సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతవరపు రాజు, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిరాజు అన్నారు. కాకినాడలో సోమవారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీతో పాటు వివిధ రాజకీయల పార్టీల నేతలు హాజరయ్యే మాదిగ, ఉప కులాల సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాల పర్యటనలో భాగంగా కృష్ణమాదిగ ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయమని, కూటమి ప్రభుత్వం వర్గీకరణ అనుకూలంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.నూకరాజు, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటరమణ, నాయకులు మిరియాల వీరబాబు, ఎం.వెంకట్రావు, డేవిడ్‌రాజు, ఆరుగొల్లు పండు, రవికుమార్ పాల్గొన్నారు.


క్వార్టర్స్‌లో 1,700 కిలోల బియ్యం అక్రమ నిల్వలు

ప్రిన్సిపాల్ సలోనిపై సస్పెన్షన్ వేటు

రాజవొమ్మంగి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రభుత్వ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ క్వార్టర్స్‌లో 1,700 కిలోల బియ్యం బయటపడ్డ ఘటనలో ప్రిన్సిపాల్ సలోనిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 24వ తేదీన ఎంపీపీ గోము వెంకటలక్ష్మి కళాశాలను తనిఖీ చేసిన సమయంలో బియ్యం అక్రమ నిల్వలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. వెంటనే గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి వచ్చి ప్రాథమిక దర్యాప్తు చేసి నివేదికను ఐటీడీఏ పీవో కట్టా సింహాచలానికి ఇచ్చారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడమే కాక విద్యార్థులతో బియ్యం బస్తాలు మోయించినందుకు ప్రిన్సిపాల్ సలోనిని సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఫోనులో ఫిర్యాదు చేయడం, డిప్యూటీ డైరెక్టర్ ప్రాథమిక దర్యాప్తు నివేదిక మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచడం, సిబ్బంది సహకరించారా..? తదితర అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి 10 రోజుల్లో నివేదిక ఇచ్చేందుకు గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజును విచారణ అధికారిగా నియమించినట్టు పీవో చెప్పారు.

34 బియ్యం బస్తాలను విద్యార్థినులతో మోయించి వారిని బానిసలుగా మార్చిన ప్రిన్సిపాల్ సలోనిపై శాఖాపరమైన చర్యలతో సరిపెట్టడం సరికాదని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా ఉండాలంటే కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, కలెక్టర్ మహేష్‌కుమార్

క్రీడలతో పోటీతత్వం

అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభ సభలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

మలికిపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక, మానసిక ఉత్తేజం పొందడంతో పాటు పోటీతత్వం అలవరచుకునేందుకు దోహదపడతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, పాఠశాల క్రీడా సమాఖ్య అధ్యక్షుడు ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. పాఠశాల విద్యా శాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల అండర్- 14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంటను సోమవారం ఆయన మలికిపురంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కోరిన విధంగా మండలానికి పది ఆట స్థలాలను గుర్తించి ఉపాధి హామీ అనుసంధానంతో అభివృద్ధి చేస్తామన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రీడా వసతుల కల్పన దిశగా కృషి చేస్తానన్నారు. అమలాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి 260 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. విజేతలుగా నిలిచిన అండర్-14 నుంచి ఐదుగురు బాలబాలికలను, అండర్-17 నుంచి ఐదుగురు బాలబాలికలను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ముందుగా జాతీయ గేమ్స్ ఫెడరేషన్ జెండాను కలెక్టర్, రాష్ట్ర గేమ్స్ ఫెడరేషన్ జెండాను ఎమ్మెల్యే, జిల్లా గేమ్స్ ఫెడరేషన్ జెండాను ఉప విద్యాశాఖాధికారి ఆవిష్కరించారు. క్రీడాజ్యోతి ర్యాలీని మలికిపురం గాంధీబొమ్మ సెంటర్ నుంచి డిగ్రీ కళాశాల వరకు ఎమ్మెల్యే తీసుకువచ్చారు. కార్యక్రమంలో శ్రీరామా బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ దెందుకూరి రాంబాబురాజు, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, కరస్పాండెంట్ మంగెన వెంకటసత్యనారాయణమూర్తి, క్రీడా శాఖ కార్యదర్శి ఏవీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, ఎంఈవో ఎం.విజయశ్రీ, జాన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

ప్రత్తిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భార్యను హతమార్చిన ఘటనలో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ పెద్దాపురం జడ్జి చంద్రమౌళేశ్వరి సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామంలో 2014లో కూనిశెట్టి సుజాత, ఆమె భర్త అప్పారావు మధ్య తగాదాలొచ్చాయి. భార్య మెడకు అప్పారావు చున్నీ బిగించి హత్య చేశాడు. దీనిపై అప్పటి ఎస్ఐ వై.రవికుమార్, సీఐ సత్యనారాయణ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు నిర్వహించి పూర్తి సాక్ష్యాధారాలతో చార్జ్ షీట్ దాఖలుచేసి పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా సాక్షులను విచారించారు. అప్పారావుకు యావజ్జీవ కారాగారంతో పాటు అదనంగా 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ప్రాసిక్యూటర్‌గా కె.మృత్యుంజయరావు వాదనలు వినిపించారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ బి.లక్ష్మీకాంత్... కేసు తుది తీర్పు వెలువడే వరకు దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఆమె చెప్పారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. వైద్యచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.48లక్షల చెక్కులను సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 18 కుటుంబాలకు అందజేశారు. మేడిశెట్టి ఈశ్వరరావు, రెడ్నం సత్తిబాబు, అమలకంటి బలరామ్, పొంగా బుజ్జి, పసగడుగుల శేషగిరిరావు, తుమ్మల సునీత, రిక్కా లక్ష్మి పాల్గొన్నారు.

మాతృశాఖలో విలీనం చేయాలని వినతి

కాకినాడ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ అసిస్టెంట్లను మాతృశాఖలో విలీనం చేయాలని కోరుతూ జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లిఖార్జునరావు(డీహెచ్‌వో)కు గ్రామ ఉద్యాన సంఘ సభ్యులు సోమవారం కాకినాడ ఉద్యానవన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యాన శాఖలో రేషన లైజేషన్ నిలిపివేయాలని, తమకు సచివాలయ వ్యవస్థతో సంబంధం లేకుండా ఉద్యాన అధికారి పర్యవేక్షణలో పనిచేసే విధంగా వీలు కల్పించాలని కోరారు. హార్టికల్చర్ అసిస్టెంట్లకు రెండో విడతలో 661 మందికి హెచ్‌ఈవో పదోన్నతులు కల్పించాలని కోరారు. ఉద్యాన సహాయకులు గ్రామస్థాయిలో 2429 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. డీహెచ్‌వో మాట్లాడుతూ ఈ సమస్యలన్నింటిని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

'ఉచిత ఇసుక అందుబాటులోకి తేవాలి'

పెద్దాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని, అందరికీ గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని సీపీఎం జిల్లా నేత దువ్వా శేషుబాబ్జీ అన్నారు. పట్టణంలోని యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం నిర్వహించిన మండల మహాసభలో ముందుగా సీపీఎం సీనియర్ నేత చల్లా విశ్వనాథం జండాను ఆవిష్కరించారు. అనంతరం శేషుబాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనలో కొత్తగా ఏమీ మార్పు జగరలేదని, మద్యం ఏరులై పారుతోందన్నారు. మద్యాన్ని చౌకగా చేసి ప్రజల జీవితాలను విచ్ఛిన్నం చేశారన్నారు. ఉచిత ఇసుక అంటూ ప్రగల్భాలు పలికి ఊరువాడా ప్రచారం చేసి కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఇసుక దందాను ప్రారంభించారని ధ్వజమెత్తారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాలన్నారు. సీపీఎం నేతలు రాజశేఖర్, కరణం ప్రసాదరావు, నీలపాల సూరిబాబు, గడిగట్ల సత్తిబాబు పాల్గొన్నారు.

'వెయ్యి ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు'

పెద్దాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామల్లో వెయ్యి ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్టు ఎంపీడీవో డి.శ్రీలలిత తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా ఇంకుడు గుంతలు తవ్వడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంకుడు గుంతలు తవ్వడానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయినట్టు చెప్పారు. ఒక్కో గుంత పొడవు, వెడల్పు లోతు 1.20 మీటర్లు ఉండేలా తవ్వకాలు చేపట్టడం జరుగుతుందని, ఇందుకోసం వేతనదారుడికి రూ.550, సామగ్రి కొనుగోలుకు రూ.5,450 ఖర్చు చేయాల్సి ఉంటుందని, మండలంలో రూ.60 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ప్రజా భాగస్వామ్యంతో ఇంకుడు గుంతల తవ్వకాలపై ప్రత్యేకదృష్టి సారించనున్నట్టు పేర్కొన్నారు.

సూర్యకాంతం శతజయంతి

పిఠాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటి సూర్యకాంతం శతజయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో సోమవారం రాత్రి నిర్వహించారు. సూర్యకాంతం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా సినీ, సీరియల్స్ దర్శకుడు రావుశ్రీ సూర్యకాంతం నటనా కౌశల్యంపై మాట్లాడారు. సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం కార్యదర్శి కొండేపూడి శంకరరావు, గట్టి శ్రీకృష్ణదేవరాయ వెంకటరావు, కేవీవీఎస్ ప్రసాద్, అల్లవరపు నగేష్ పాల్గొన్నారు.

వేళంగిలో గ్రామ సభ

కరప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వేళంగిలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ మాట్లాడుతూ భూసంబంధిత సమస్యలు ఏమున్నా గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సర్పంచ్ సవిలే నీలిమారాజేష్, టీడీపీ సీనియర్ నేత చుండ్రు వెంకన్నరాయచౌదరి, జనసేన గ్రామకమిటీ అధ్యక్షుడు గరగ జెమ్మి, రీసర్వే డీటీ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, ఆర్ఐ పవన్ ఉన్నారు.

సీపీఎం ధర్నా

పిఠాపురం, అక్టోబరు 27: ప్రజలపై ఆదనపు భారం పడేలా ట్రూఅప్ చార్జిల పేరుతో విద్యుత్ బిల్లులను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం కన్వీనర్ కుంచే చిన్నా, కోనేటి రాజు, నాగేశ్వరరావు, మణి, ప్రజాసంఘాల నాయకులు మణికంఠ, స్టాలిన్, వీరబాబు పాల్గొన్నారు.

సామర్లకోట భీమేశ్వరాలయ పుష్కరిణి..

దుర్గంధభరితంగా..



సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయ కోనేరు పుష్కరిణి దుస్థితి

» మూడురోజుల్లో కార్తీకమాసం ప్రవేశం

» భక్తుల పవిత్ర స్నానాలకు తప్పని ఇక్కట్లు

సామర్లకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రంగా పేరొందిన సామర్లకోట భీమేశ్వరాలయంలో కార్తీకమాస ఏర్పాట్లు అరకొరగా ఉన్నాయి. మరో మూడురోజుల్లో రానున్న కార్తీకమాస పర్వదినాలకు రాష్ట్ర నలుమూలల నుంచీ భక్తులకు ఇక్కడకు రానున్నారు. కాగా, కోనేరు పుష్కరిణిలో గోదావరి జలాలు నింపడంలో దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మరో మూడు రోజుల్లో కార్తీకమాసం రానుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న పవిత్ర పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనాలకు వెళ్తుంటారు. సోమవారం మాత్రమే కాకుండా మామూలు రోజుల్లో సైతం ఆలయ ఆవరణలోని శివలింగానికి పుష్కరిణి జలాలతో అభిషేకించే భక్తులు కోనేరు పుష్కరిణిలో నీరు లేకపోవడంతో కాలభైరవ స్వామి ఉపాలయం ఎదురుగా ఉన్న కుళాయినుంచి నీటిని నింపుకుని శివలింగానికి అభిషేకాలు చేస్తూ ఆలయ అధికారుల తీరుపట్ల విమర్శలు చేస్తున్నారు. ఇటీవలకాలంలో ఆలయ కోనేరు పుష్కరిణిలో నిల్వనీటిని పూర్తిగా తొలగించారు. కోనేరు పుష్కరిణిని బ్లీచింగ్‌తో శుభ్రపరచాల్సి ఉంది. దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పుష్కరిణి పరిసరాల్లోనేగాక ఆలయం ఆవరణలో దుర్గంధం వెదజల్లుతుండడంతో సోమవారం ఆలయానికి చేరుకున్న వందలాదిమంది భక్తులు ముక్కు మూసుకోకుండా ఆలయం దర్శించలేకపోయారు. మరో మూడు రోజుల్లో రానున్న కార్తీకమాస పర్వదినాలకు భక్తులకు ఏర్పాట్లు ఎలా చేస్తారోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆలయం ఆవరణలోను, పరిసరాల్లోను చెత్తాచెదారాలతో అపారిశుధ్య వాతావరణంతో నిండిఉంది. అయినా దేవదాయ అధికారులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ చర్యలు తీసుకోలేదు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల మనోభావాలకు ముప్పు వాటిల్లే అవకాశాలున్నట్లు ఆందోళన చెందు తున్నారు. కాగా ఆలయ అధికారి వివరణ కోరేం దుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించినా అందుబాటులో లేరు.

క్రైస్తవ శ్మశానవాటిక వద్ద ఉద్రిక్తత

పిఠాపురంలో ఇరువర్గాల మధ్య వివాదం.. పోలీసు, రెవెన్యూ అధికారుల చర్చలు



ఇరువర్గాలతో చర్చలు జరుపుతున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

పిఠాపురం, అక్టోబరు 28: పిఠాపురంలోని కోర్టుల సముదాయం సమీపంలోని క్రైస్తవ శ్మశానవాటిక వద్ద సోమవారం మధ్యాహ్నం తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. నిర్వహణ విషయంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం, శ్మశానవాటికకు తాళాలు వేయడం, తీయించడం, ఒక వర్గం ధర్నా నిర్వహించిన నేపథ్యంలో మరో వర్గం ఆందోళనకు దిగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కోర్టుల సముదాయం సమీపంలో గల క్రైస్తవ శ్మశానవాటిక(సమాధుల సముదాయం) నిర్వహణ విషయంలో కొంతకాలంగా 2వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ శ్మశానవాటిక నిర్వహణను ఏబీసీ చర్చి చూస్తోంది. ఇక్కడ మృతదేహాలు ఖననం చేసేందుకు సొమ్ములు వసూలు చేస్తున్నారు. దీంతో ఒక వర్గం వ్యతిరేకిస్తోంది. మృతదేహం ఖననానికి సొమ్ములు వసూలు చేయడాన్ని నిరసిస్తూ అగ్రహారం వాసులు శ్మశానవాటిక ప్రధాన ద్వారానికి తాళాలు వేశారు. దీనిపై చర్చి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఇరువర్గాలతో మాట్లాడి తాళాలు తీయించారు. ఈ సంఘటన జరిగిన అనంతరం ఆదివారం మధ్యాహ్నం ఏబీసీ చర్చి సెమిట్రీ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన, ధర్నా నిర్వహించడంతో పాటు క్రైస్తవ శ్మశానవాటికను కబ్జా చేసేందుకు కొందరు రాబంధులు ప్రయత్నిస్తున్నారంటూ కరపత్రాలు పంచారు. దీంతో అగ్రహారంవాసులు ఆగ్రహానికి గురయ్యారు. సోమవారం శ్మశానవాటిక సమీపంలో మోహరించారు. అదే సమయంలో భీమ్‌నగర్‌కు చెందిన పి.నాగేశ్వరరావు మరణించగా మృతదేహాన్ని ఖననం చేసేందుకు కాకినాడ నుంచి మహాప్రస్థానం వాహనంలో తీసుకువచ్చారు. తమపై అసత్య ఆరోపణలు చేస్తున్న వ్యక్తులు వచ్చి సమాధానం చెబితేకాని మృతదేహాన్ని శ్మశానవాటికలోకి తీసుకువెళ్లనివ్వబోమంటూ అగ్రహారం వాసులు అడ్డుకున్నారు. అక్కడే ఆందోళనకు దిగారు. దీంతో పిఠాపురం తహశీల్దారు వీవీ గోపాలకృష్ణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మణికుమార్ ఇరువర్గాలతో చర్చలు జరిపారు. మృతదేహాన్ని ఖననానికి తీసుకువెళ్లడంతో పాటు గేటుకు తాళాలు వేయకుండా ఉండేలా వారిని ఒప్పించారు. ఇరువర్గాల ప్రతినిధులతో చర్చలు జరిపి పరిష్కారం చూపిస్తామని తహసీల్దారు, సీఐ తెలపగా ఆందోళన విరమించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



పెద్దాపురంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప, డీఎస్పీ

పెద్దాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సీహెచ్‌సీ, రోటరీ క్లబ్, సహకారంతో రోటరీ బ్లడ్ బ్యాంక్ వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆపద సమయంలో రక్తం ఎంతో అవసరమవుతుందన్నారు. పోలీసులు కూడా సేవా కార్యక్రమాల్లో భాగంగా సమాజానికి ఉపయోగపడే విధంగా రక్తదాన శిబిరాల్లో రక్తదానం చేసి ఎంతోమందిని కాపాడుతున్నారని పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. డీఎస్పీ డి.శ్రీహరి రాజు మాట్లాడుతూ పోలీసులు రేపటి తరాల భవిష్యత్తుకు ప్రాణత్యాగాలు చేశారన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పెద్దాపురం, సామర్లకోట సీఐలు టి.క్రాంతికుమార్, ఏ.కృష్ణభగవాన్, ఎస్సై మౌనిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో పునర్జన్మ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆపద, ప్రమాద సమయంలో రక్తం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానంతో ఎందరో ప్రాణాలు కాపాడినవారు అవుతామని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎస్ దేవానందనరావు అన్నారు. పోలీసు సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఎస్పీ యూనిట్ హాస్పిటల్లో జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిచిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 72 మంది రక్తదానం చేశారు. జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు డాక్టర్ జి.లక్ష్మి, యూనిట్ మెడికల్ ఆఫీసర్లు సునీల్ కుమార్, లక్ష్మీదేవి, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకుమార్, మన్మధరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీ



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న పట్టురైతులు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టురైతుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి వచ్చిన ఎంపీని పట్టురైతులు సోమవారం కలిసి తమ సమస్యలపై విన్నవించారు. నాసిరకం పట్టుగుడ్లు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, 2నెలల వ్యవధిలో ఒక్కొక్క రైతుకు రూ.80వేల వరకూ నష్టం జరిగిందని చెప్పారు. దీనిపై విచారణ జరిపించి లోపం ఎక్కడ ఉందో కనుగొనాలని, రైతులను ఆదుకోవాలని కోరారు. గత నాలుగేళ్లుగా పట్టురైతులకు రావాల్సిన ఇన్సెంటివ్ బకాయిలు రాష్ట్రవ్యాప్తంగా రూ.60కోట్లు ఉండగా, కాకినాడ జిల్లాలో రూ.2కోట్లుకు పైగా ఉన్నాయని వివరించారు. ఈ బకాయిలను తక్షణం చెల్లించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పట్టు విక్రయాలు స్థానికంగా జరిగే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా పట్టురైతులు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావును కలిసి వినతి అందజేశారు.

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో సభ్యత్వ నమోదు చేసుకుంటున్న వర్మ

పిఠాపురం, అక్టోబరు 28: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, వారి సంక్షేమానికి పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఎల్లప్పుడు ఆలోచిస్తూ ఉంటారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో సోమవారం వర్మ ఆన్‌లైన్‌లో పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం రూ.100 సభ్యత్వంతో రూ.5లక్షల బీమా సౌకర్యాన్ని పార్టీ కల్పిస్తున్నదన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో అందరూ పాల్గొనాలన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు, సిద్ధాంతాలను ప్రజలకు వివరించి వారిని పార్టీలో సభ్యులుగా చేర్పాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం



కరప: వేములవాడలో పరిశీలిస్తున్న పిల్లి దంపతులు

కరప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కాకినాడరూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు పేర్కొన్నారు. కరప మండలం వేములవాడ, వలసపాకల గ్రామాల్లో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. పార్టీ సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు గతంలో రూ.2లక్షల ప్రమాద బీమాను ఈ ఏడాది నుంచి రూ.5 లక్షలకు పెంచినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు అప్పనపల్లి నారయ్య, చాట్ర ఇమ్మానుయేల్, మద్దూరి స్వామి పాల్గొన్నారు.

అధ్యాపకుల అకడమిక్ ఎక్స్‌లెన్స్ అభివృద్ధి : వీసీ

జేఎన్టీయూకే, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ఎంగేజ్‌మెంట్, టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ద్వారా అకడమిక్ ఎక్సలెన్స్‌ను అభివృద్ధి చేసేందుకుగాను జేఎన్టీయూకే, మలేషియా దేశం మెలాకాలోని యూనివర్సిటీ టెక్నికల్ మలేషియా సంయుక్త ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న జేఎన్టీయూకే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ సోమవారం వీసీ సమావేశ హాల్లో సమీక్షించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ పర్యటన ద్వారా ముఖ్యంగా రాబోయే సాంకేతిక నైపుణ్యాలు, నాయకత్వ సాధనాలతో అధ్యాపకుల అకడమిక్ ఎక్సలెన్స్‌ను అభివృద్ధి చేయవచ్చన్నారు. మలేషియా వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఒక్కొక్కరి ఖర్చు రూ.1,80,000 కాగా జేఎన్టీయూకే బృందంలోని ఒక్కొక్కరికీ రూ.90,000 మాత్రమేనని రిజిస్ట్రేషన్ ఫీజును ఒక్కొక్కరికీ రూ.90,000లను వీసీ మురళీకృష్ణ చొరవతో యూనివర్సిటీ టెక్నికల్ మలేషియా తగ్గించినట్టు రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ తెలిపారు. సమీక్షలో సీఈ శ్రీనివాసులు, యూసీఈకే వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి, లైబ్రేరియన్ డాక్టర్ దొరస్వామినాయక్, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్, జేఆర్ జోగారావు, డీఆర్ నాగేశ్వరరావు, సత్యనారాయణ, డైరెక్టర్లు స్వర్ణకుమారి, ఏ.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు న్యాయం చేయాలని ఆందోళన

కరప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జనసేననాయకుల వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ పులపకూర సునీతకు న్యాయంచేయాలంటూ పలువురు ఎస్సీ నాయకులు సోమవారం కరపలో ఆందోళనకు దిగారు. తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ల ఎదుట బైఠాయించి బాధ్యులపై తక్షణమే కేసు నమోదుచేయాలని డిమాండ్‌చేశారు. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి, గ్రామకమిటీ అధ్యక్షుడు గంటా నానిబాబు, వీరమహిళ భవానీలపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుచేయాలని వారు నినదించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆందోళనకారులతో చర్చించారు. సీఐ ఆదేశాల మేరకు కరప ఎస్‌ఐ తోట సునీత ముగ్గురు జనసేన నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేయడంతో ఆందోళనను విరమించారు. ఆందోళనలో మాల మహానాడు జాతీయనాయకుడు పండు అశోక్, బీఎస్పీ నాయకుడు సుబ్బుబాయ్, వ్యవసాయ సంఘం జిల్లా నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ, ఎస్సీ నాయకులు గుబ్బల రామకృష్ణ, పత్తిపాటి బుల్లిరాజు, సవిలే రాజేష్, ఖండవల్లి లోవరాజు, మాతా అప్పారావు, చిన్నం వెంకటేశ్వరరావు, వజ్రపు కామేశ్వరరావు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని డ్రైవర్ల ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): క్లాప్ వాహన డ్రైవర్ల 3నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ అర్బన్ తహశీల్దార్ కార్యాలయం నుంచి అర్ధనగ్నంగా ప్రదర్శన చేసుకుంటూ కలెక్టరేట్ వద్దకు వచ్చి సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ కాకినాడ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కోకన్వీనర్ పలివేల వీరబాబు మాట్లాడుతూ 4 రోజుల నుంచి క్లాప్ వాహన డ్రైవర్లు పలు రూపాల్లో ఆందోళన చేస్తున్నారని, దీనిపై జిల్లా అధికారుల చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో తక్షణమే జిల్లా అధికారులు దృష్టి పెట్టి బకాయి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు, క్లాప్‌వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, కొండబాబు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొత్తపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పొన్నాడ-నాగులాపల్లి గ్రామాల మధ్య ఉప్పుటేరులో సోమవారం వ్యక్తి మృతదేహం లభ్యమైందని కొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఉప్పుటేరులో శవం కొట్టుకొనిపోతు ఉందన్న స్థానికుల సమాచారం మేరకు వెళ్లి బయటకు తీసినట్టు చెప్పారు. సుమారు ఎత్తు 5/5, నలుపురంగు శరీరం, గెడ్డం నలుపు రంగు, శరీరంలో నలుపు రంగు చెక్స్ షర్ట్, ప్యాంటు ధరించి ఉన్నాడు. కుడి చేతికి స్టీల్ కడియం ఉందన్నారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. ఆ వ్యక్తి ఎవరికైనా తెలిసి ఉంటే వివరాల కోసం 9440900752లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.



పొన్నాడ-నాగులాపల్లి ఉప్పుటేరులో లభ్యమైన మృతదేహం

ఏటీఎం పగులకొట్టి నగదు చోరీ చేసిన వ్యక్తికి జైలు, జరిమానా

పిఠాపురం, అక్టోబరు 28: ఏటీఎం పగులకొట్టి నగదు చోరీ చేసిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పిఠాపురం ప్రిన్సిపాల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.విజయరామేశ్వరీ సోమవారం తీర్పు చెప్పారు. పిఠాపురంలోని చర్చి సెంటర్ సమీపంలో ఉన్న డీసీసీబీ బ్యాంకుకి చెందిన ఏటీఎంను ఏప్రిల్ 2వ తేది అర్థరాత్రి దాటిన తర్వాత పగులకొట్టి అందులో నగదు రూ.1,100 చోరీ చేసినట్టు డీసీసీబీ మేనేజరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పిఠాపురం పోలీసులు పట్టణంలోని చెరుకుల కాలువ ప్రాంతానికి చెందిన పెనుబోతుల సూరిబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం నిందితుడికి నాలుగు సంవత్సరాల వారం రోజులు జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఆకుల లీల నాగరోజా వాదనలు వినిపించారు.

'ప్రతీ ఉద్యోగి ఓటుహక్కు వినియోగించుకోవాలి'

కాకినాడ సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో పట్టభద్రుల ప్రతినిధిగా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ప్రతీ ఉద్యోగి ఓటు హక్కు నమోదు చేసుకుని వినియోగించుకోవాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు కోరారు. కాకినాడ ఎన్జీవో హోంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని తాలూకా కేంద్రం, ఎన్జీవో హోంలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేందుకు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లింపు చేయడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, పి.రాజుబాబు, కేవీఎస్వీ ప్రసాద్, పి.పాండురంగారావు, జిల్లా కోశాధికారి వై.పద్మ మీనాక్షి పాల్గొన్నారు.

గ్రామీణ అడవుల పెంపకానికి ప్రాధాన్యం: డీఎఫ్‌వో



చేబ్రోలులో నగరవనం ఏర్పాటుకు పరిశీలన జరుపుతున్న డీఎఫ్‌వో, ఆర్డీవో

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 28: నగర వనంలో బాగంగా గ్రామీణ అడవుల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని సర్వేనెంబరు 85,93ల్లో గల 24 ఎకరాల్లో నగరవనం ఏర్పాటుకు గానూ కాకినాడ ఆర్డీవో మల్లిబాబుతో కలిసి సోమవారం పరిశీలించారు. కంకరగనిగా ఉన్న ఈ ప్రాంతం అనుకూలతలపై పరిశీలన జరిపారు. తహశీల్దారు సత్యనారాయణ, సర్వేయర్ కేదారేశ్వరరావు తదితరులున్నారు.

'అది కల్తీ నెయ్యి కాదు'

పిఠాపురం, అక్టోబరు 28: పిఠాపురంలో ఇటీవల పట్టుబడింది కల్తీ నెయ్యి కాదని, అది కొవ్వు నుంచి తయారు చేసిన నూనె అని జిల్లా ఫుడ్ ఇనస్పెక్టర్ శ్రీనివాస్, ఫుడ్‌సేఫ్టీ అధికారి సుబ్బారావు స్పష్టం చేశారు. పిఠాపురంలో సోమవారం రాత్రి మున్సిపల్ కమిషనరు కనకారావు, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ మణికుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొవ్వు నుంచి నెయ్యి తయారు చేయరని స్పష్టం చేశారు. పాలు, పెరుగు నుంచి మాత్రమే నెయ్యి తయారవుతుందన్నారు. ఈ కొవ్వుతో నూనె మాత్రమే తయారు చేయవచ్చన్నారు. అది దీపం నూనెగా, సబ్బుల తయారీకి వెళ్తుందని దీనిపై విచారణ జరుపుతున్నామన్నారు. ఐఎస్‌ఐ మార్కు లేని వాటర్‌బాటిల్స్ ప్యాకింగ్ యూనిట్లపై కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

'దేశభక్తి పెంచుకోవాలి'

కొత్తపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి భావం పెంపొందించుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎంవీ చలపతిరావు, కేవీఎస్ఎస్ ప్రసాద్ కోరారు. ఆగస్టు 15న నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులకు బహుమతులు, ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను సోమవారం వారు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రమణమూర్తి, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు డి.అప్పలరాజు, జి.మురళీ, వీ. ఉమామహేశ్వరరావు, కె.సాంబశివరావు, ఎస్ వీర్రాజు, జాన్‌సన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 50మందికి కాకినాడ మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు జైలు, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.రమేష్, డి.రామారావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 50మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా 22మందికి ఒక్కొక్కరికి 2రోజులు చొప్పున జైలు శిక్ష, మరో 28మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పినట్టు సీఐ రమేష్ తెలిపారు.

నేడు లోకాయుక్త విచారణ

సామర్లకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేట్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి లోకాయుక్త విచారణ నిర్వహించనున్నట్టు సామర్లకోట ఎంపీడీవో కార్యాలయ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీలో గత పాలకవర్గంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై లోకాయుక్త విచారణ నిర్వహించనున్నట్టు, జెడ్పీ సీఈవో, జిల్లా ఆడిట్ అధికారి తదితర పంచాయతీ ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

సూర్యారావుకు సత్కారం

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పాన్ ఇండియా సోషియో కల్చర్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త తురగా సూర్యారావును సత్కరించారు. పుదుచ్చేరి ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నుంచి ఈ సత్కారం అందుకున్నారు. సంస్థ వ్యవస్థాపకులు అద్దంకి రాజా, డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్, అనపాల ఆంజనేయరెడ్డి, గూటం స్వామి పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

పెద్దాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానానికి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త చక్కా సతీష్ రూ.42 వేలు విరాళంగా అందించినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మీ తెలిపారు. దాతకు మర్యాదలతో ఘన స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేశామన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం రక్తపరీక్షలు నిర్వహించారు. ఎనిమీయా ముక్త్ భారత్‌లో భాగంగా ఆర్‌బీఎస్‌కే కింద విద్యార్థులందరికీ హిమోగ్లోబిన్ టెస్టులు చేసినట్టు వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు తెలిపారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ కోర్టు సందర్శన

పెద్దాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కోర్టును న్యాయసేవాధికార సంస్థ (రాజమహేంద్రవరం) కార్యదర్శి ప్రకాష్‌బాబు సోమవారం సందర్శించారు. సబ్ జైల్లో ఉన్న ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాది ఎస్.దుర్గారావు పాల్గొన్నారు.

నేడు ధన్వంతరి హోమం

తుని రూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ ఆయుర్వేద వైద్య శాల పాయకరావుపేటలో మంగళవారం ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సర్వజన ఆరోగ్య సిద్ధికి శ్రీధన్వంతరి హోమం జరుగుతుందని, కేరళ ప్రఖ్యాత ఆయుర్వేద వైద్యులు డాక్టర్ రమేష్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రక్తదానం చేస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు

ప్రజా రక్షణే ధ్యేయం: ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

చింతూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా రక్షణే పోలీసుల ధ్యేయమని చింతూరు ఏ ఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని సోమవారం చింతూరులో నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేస్తారన్నారు. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏఎస్పీ సహా పలువురు పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు, విద్యార్థులు రక్తదానం చేశారు. వ్యాస రచన, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరిపి విజేతలకు బహుమతులు, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్, సీఐ దుర్గాప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, తహసీల్దారు చిరంజీవి, చింతూరు ఎస్ఐ పేరూరి రమేష్, మోతుగూడెం ఎస్ఐ కె.శివనారాయణ, చింతూరు ఏరియా ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి టీవీ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సింహాచలం

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 75 అర్జీలు

రంపచోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ అర్జీలు స్వీకరించారు. గిరిజన కులాలకు గ్రామసభల తీర్మానాలతో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, లొంగిపోయిన మాజీ నక్సలైట్లకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమి కేటాయించాలని, వాల్మీకి కుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్లో పొందుపరచాలని, గిరిజన రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేయాలని, గ్రామాల్లో రహదారులను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఎస్డీసీ జాన్‌రాజ్, డిప్యూటీ డైరెక్టర్లు విజయశాంతి, షరీఫ్, డీఎల్పీవో రఘునందన్, ఏపీడీ దేగలయ్య, డీఈవో మల్లేశ్వరరావు, డాక్టర్ వెంకట ఇందిర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వై.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, తహసీల్దారు ఏఎస్వీ సత్యనారాయణ, ఎంపీడీవో జయంతి, సీడీపీవో సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ నిరుద్యోగులు

జీవో నెం.3పై స్పష్టత ఇవాలి

వీఆర్ పురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో జీవో నెం.3పై స్పష్టత ఇవ్వకుంటే భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఆదివాసీ నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పాయం లక్ష్మణరావు మాట్లాడుతూ... జీవో నెం.3 ప్రకారం కాకుండా ఏజెన్సీలో ఉద్యోగ నియామకాలు చేపడితే ఆదివాసీలకు అన్యాయం చేసినట్టే అన్నారు. జనరల్ రిజర్వేషన్‌లో ఆదివా సీలకు కేవలం 6శాతం రిజర్వేషన్ మాత్రమే వర్తిస్తుందన్నారు. జీవో నెం.3ని పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. ఏజెన్సీలో వందకు వంద శాతం ఉద్యోగాలను గిరిజనులకే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పులి అశోక్, ముత్యాలరెడ్డి, గౌతమ్, విశ్వంత్ దుర్గాప్రసాద్, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రేపటిలోగా అభ్యంతరాలు తెలపాలి'

రంపచోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ టీచర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హత వివరాలను ఐటీడీఏ కార్యాలయ నోటీసు బోర్డులో పొందుపరిచినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. అభ్యంతరాలను గురుకుల సెల్‌లో ఈ నెల 30వ తేదీలోగా తెలిపాలని సూచించారు. నవంబరు 1న గురుకుల పాఠశాల (బాలురు) రంపచోడవరం, 2న ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాలులో డెమోలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులకు ఆయా సబ్జెక్టుల్లో ఇంటర్వ్యూలు, డెమోలు నిర్వహిస్తామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు సమావేశం

రంపచోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై స్థానిక ఆర్‌పీ పంక్షన్ హాల్లో మంగళవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలుగు యువత నియోజకర్గ అధ్యక్షుడు మఠం విజయ భాస్కర్ తెలిపారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవితో పాటు నియోజకవర్గ సమన్వయకర్త చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి హాజరవుతారన్నారు. నియోజక వర్గంలోని 11 మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అధికారుల తీరు మారదా?

రౌతులపూడిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు అధికారులు దూరం, మధ్యాహ్నం 12 గంటలకు కూడా రాని వైనం

రౌతులపూడి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయం నందు ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం తీరు మారలేదు. ఉదయం 10 గంటలకే హాజరై ఫిర్యాదులు స్వీకరించాల్సిన అధికారులు 12 గంటలైనా హాజరుకాలేదు. తహశీల్దార్ కార్యాలయం నందు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకిలక్ష్మి మాత్రమే హాజరయ్యారు. తహశీల్దార్ ఇన్‌చార్జ్‌గా కాగా డిప్యూటీ తహశీల్దార్ కూడా హాజరుకాలేదు. మండలానికి సంబంధించి వివిధశాఖలకు చెందిన ఏ అధికారి హాజరుకాకపోవడంతో ఫిర్యాదు చేయడానికి వచ్చినవారు 12 గంటల వరకూ ఎదురుచూసి వెనుతిరిగారు. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగానే ప్రభుత్వ కార్యాలయాల తీరుఉందని, కూటమి ప్రభుత్వం వచ్చినా మండలంలో అధికారుల తీరు మారకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ స్పందించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు అధికారులందరూ హాజరయ్యేలా చూసి తమ సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.



తహశీల్దార్ కార్యాలయానికి ఒక్కరే హాజరైన దృశ్యం



లంపకలోవలో ఆందోళన చేస్తున్న చేదులూరి గవరయ్య

'విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ప్రత్తిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ హైస్కూల్లో సరస్వతిదేవి విగ్రహం ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని హిందూ ధర్మరక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గవరయ్య డిమాండ్ చేశారు. లంపకలోవ పంచాయతీ కార్యాలయం సమితి కార్యకర్తలు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన ఆందోళన నిర్వహించారు. ఆందోళన పాల్గొన్న గవరమయ్య మాట్లాడుతూ విగ్రహాన్ని కూల్చిన దుండగులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని దీనిపై పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి చూపాలని కోరారు. ఆందోళనలో హిందూ ధర్మ రక్ష సమితికి చెందిన రెడ్డిశేఖర్, ఇంటి వీర నాగేశ్వరరావు, రెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తునిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పోలీసులు

తుని రూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకుని తుని పోలీసులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తుని ఏరియా ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు యనమల రాజేష్, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో 30 మంది పోలీసులు, 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ డాక్టర్ స్వప్న, మోతుకూరి వెంకటేష్,రూరల్ సీఐ చెన్న కేశవరావు, డాక్టర్ గంటలు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

ఏలేశ్వరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఏలేశ్వరంలో ఎల్ఐసీ ఏజెంట్లు నిరసన తెలియజేశారు. సోమవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట శాటిలైట్ ఆఫీస్ ఏజెంట్లు యూనియన్ అధ్యక్షుడు కోరుకొండ నూకరాజు నేతృత్వంలో ఏజెంట్లు తమ డిమాండ్లు నెరవేర్చే వరకు నిరసన తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోళ్ల నాగేశ్వరరావు, టి.లక్ష్మణరావు, వెల్లంపల్లి సుబ్బారావు, పాండ్రంకి నూకరాజు, మాగంటి సూరిబాబు, రౌతు సహదేవుడు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

రౌతులపూడి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): రూ.100తో టీడీపీ సభ్యత్వాన్ని తీసుకుని రూ.5 లక్షలు ప్రమాద బీమా పొందాలని టీడీపీ నాయకులు కోరారు. మండలంలోని రాజవరం, దిగిశివాడ గ్రామాల్లో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, జేట్లారాజా, చింతకాయల రాజు పసగడుగుల రమణ, ఈఅశోక్‌మూర్తి పాల్గొన్నారు.

రైతుల పక్షాన ఉంటా : యనమల



మాజీ మంత్రి యనమలకు వినతిపత్రం అందజేస్తున్న బెండపూడి రైతులు

తుని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తుని నియోజకవర్గంలో బెండపూడి వద్ద ఎయిర్ స్ట్రిప్‌కు రంగం సిద్ధమైంది. దీంతో బెండపూడి పరిసర ప్రాంతాల్లో 519 ఎకరాల స్థల సేకరణకు అధికారులు సిద్ధం అవడంతో ఆ ప్రాంత రైతులు ఆందోళన బాట పట్టారు. తమను ఆదుకోవాలని, రెండు పంటలు పండే భూమి తీసుకుని తాము తీవ్రంగా నష్టపోతామని సోమవారం తేటగుంటలో మాజీ మంత్రి యనమలకు రామకృష్ణుడికి మొరపెట్టుకున్నారు. యనమల మాట్లాడుతూ రైతులు ఎటువంటి ఇబ్బంది ఎదుర్కోవడానికి తాను సానుకూలం కాదని, రైతుల పక్షాన ఉండి వారికి న్యాయం చేసే దిశగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌తో మాట్లాడి సమస్య వివరించి స్థల సేకరణ రైతులకు ఇబ్బందిలేని ప్రాంతంలో చేపట్టడంతో వారు హర్షం వ్యక్తంచేశారు.

రాజశేఖర్ గెలుపు అందరీ బాధ్యత

టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

కిర్లంపూడి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు అందరీ బాధ్యతని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రపురం, వీరవరం, రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాల్లో కూటమి నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జ్యోతుల నవీన్ విచ్చేసి టీడీపీ సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై మాట్లాడారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న పెళ్లికానుకపై వివరించారు. ఎంపీపీ తోట రవి, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, అనుకుల శ్రీకాంత్, సూరిశెట్టి వెంకటశివ, గంధం ఈశ్వరరావు, బస్వా వీరబాబు, జ్యోతుల రాంబాబు, బొదిరెడ్ల సుబ్బారావు, కంచుమర్తి రాఘవ, గొడే రాంబాబు, గొల్లపల్లి సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

ప్రకృతి వ్యవసాయంతో అధిక రాబడి : ఎంపీపీ



సిరిపురంలో రైతులను సత్కరిస్తున్న ఎంపీపీ

ఏలేశ్వరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామంలో పొలంబడి క్షేత్ర దినోత్సవం వ్యవసాయ అధికారిణి బి.జ్యోతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి హాజరై ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి సాధించిన ఉత్తమ రైతులకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. బుజ్జి మాట్లాడుతూ పొలంబడి సూచనలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక రాబడి సాధించడం ద్వారా రైతులకు ఎంతో మేలుజరుగుతుందన్నారు. డీడీఏ జిల్లా వనరుల కేంద్రం బి.హరి, ఏడీఏ వై.గంగాధర్, ఎఫ్‌టీసీఏవో సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ పొలంబడి నందు సూచనలు రైతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సర్పంచ్ పీతల నూకరాజు, వైస్ ఎంపీపీ సాదే లోవరాజు, ధనేకుల వీరభద్రరావు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

జగ్గంపేట, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడులో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ ఉచిత అన్న క్యాంటీన్‌లో సినీ నటుడు ప్రభాస్ పుట్టిన రోజు పురస్కరించుకుని జగ్గంపేట ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లిబోయిన రాజేష్, ప్రెసిడెంట్ బుక్కు హరికృష్ణ, వైస్ ప్రెసిడెంట్ నాని ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, రాష్ట్ర టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కొత్త కొండబాబు, వేముల కొండ జోగారావు, నాని, అంజి, లోవ, సాయి, వెంకట్, ప్రసాద్, మురళి, ప్రకాష్, వీర, కిట్టు ఉన్నారు



జగ్గంపేటలో భోజనాలు వడ్డిస్తున్న టీడీపీ నాయకులు, ప్రభాస్ అభిమానులు

చినజీయర్‌స్వామి శిష్య బృందం సందర్శన



ప్రత్తిపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని నరేంద్రగిరి కొండపై ఆంధ్రభద్రాద్రి పేరుతో నిర్మిస్తున్న రామాలయ కట్టడాలను సోమవారం హైదరాబాద్‌కు చెందిన చినజీయర్ స్వామి శిష్య బృందం, రఘునాథ బట్టర్ స్వామి, కమలాకర్ ఆచార్యులు సందర్శించారు. ఈ ఆలయం భవిష్యత్ లో ఆంధ్రా భద్రాచల రామక్షేత్రంగా విరాజిల్లుతుందని తెలిపారు. తర్వలో సీతానగరం ఆశ్రమాధిపతి చినజీయర్‌స్వామి సందర్శించి పాదకుల పట్టాభిషేకం నిర్వహిస్తారని వారు తెలిపారు. గ్రామపెద్దలు అనంతపల్లిశ్రీనివాస్ దంపతులు, గోదాదేవి కమిటీ మహిళా సభ్యులు, ఆంధ్రా భద్రాద్రి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఎటపాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుండాలలోని ప్రభుత్వ ఇసుక డంపు నుంచి అక్రమంగా ఇసుక లోడ్ చేసుకుని తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డంపు నుంచి ఇసుకను అక్రమంగా తరలించుపోతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే సీఐ కన్నపరాజు తన సిబ్బందితో తనిఖీకి వెళ్లారు. ఈ క్రమంలో గోళ్లగట్ట గ్రామం మీదుగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ నూతన ఉచిత ఇసుక పాలసీకు ఆటంకం కల్పిస్తూ ఇసుక బుకింగ్ నమోదు చేసుకోకుండా తరచూ అక్రమ రవాణాకు అలవాటుపడిన వ్యక్తులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని సీఐ కన్నపరాజు హెచ్చరించారు.



లోతట్టు ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వంగలమడుగులో వైద్య శిబిరం

అడ్డతీగల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా దుశ్శర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని లోతట్టు గ్రామమైన వంగలమడుగులో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని సీఐ నరసింహమూర్తి తెలిపారు. అనంతరం గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. గిరిజన జీవన విధానంపై, గంజాయి నిర్మూలనపై సీఐ అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా క్రీడల పట్ల మక్కువ చూపాలన్నారు. క్రీడా నైపుణ్యం పెంపొందించడానికి గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుశ్శర్తి ఎస్ఐ వెంకయ్య, సిబ్బంది, వైద్యాధికారులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

గండేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో గండేపల్లి గ్రామ శివారు ఎన్టీరాజపురం వెళ్లే డివైడర్ వద్ద సోమవారం మచిలీపట్నం నుంచి వైజాగ్ వెళ్తున్న కారు విద్యుత్ పోల్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. కారులో ఉన్న దిలీప్, అతడి భార్య, కుమారులు ఉన్నారు. దిలీప్, అతడి కుమారుడికి గాయాలయ్యాయి. గండేపల్లి ఎస్ఐ బి.శివనాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న క్షతగాత్రులను బయటకు తీసి వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్ క్లియర్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

ప్రత్తిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటపల్లికి చెందిన ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ముగ్గురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. తోటపల్లిలోని కోరాపు చిట్టియ్య, పల్లి సతీష్ మధ్య భూ వివాదం ఉంది. ఈ క్రమంలో మండలంలోని రాచపల్లి వద్ద కోరాపు చిట్టియ్యపై తోటపల్లికి చెందిన పల్లి సతీష్, మణికంఠ, సేవలు ముగ్గురు కత్తితో దాడి చేసి గాయపరిచారు. నిందితులను సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

పేలిన గ్యాస్ సిలిండర్

శంఖవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో అచ్చంపేట గ్రామంలో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలి చింతపల్లి గుర్రాజు, అప్పలకొండలకు చెందిన ఇళ్లు దగ్ధమయ్యాయి. బాధితులను సాయిప్రియా సేవాసమితి అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ పరామర్శించి నిత్యవసర వస్తువులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో మేకల కృష్ణ, పంపనబోయిన సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జరిమానా, జైలు

జగ్గంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో శ్రీ హరిరాజు పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ వైఆర్‌కె ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్ఐ శివనాబాబు డ్రంక్ అండ్ డ్రవ్ తనిఖీలు చేపట్టారు. ఇందులో పట్టుబడినవారిని పెద్దాపురం కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ జి.కృష్ణమాచార్య ఆరుగురు వ్యక్తులకు ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.60వేలు జరిమానా విధించారు. మరో ఇద్దరికి 2రోజులు జైలు శిక్ష విధించారు.

అయ్యప్ప విగ్రహం ఊరేగింపు

కోటనందూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకరపల్లి గ్రామంలో పంచలోహంతో తయారుచేసిన అయ్యప్ప స్వామి విగ్రహాన్ని గురుస్వామి అర్లి శ్రీనివాస్‌స్వామి ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. సుమారు 100 మంది అయ్యప్ప భక్తులు స్వామి చరణం అంటూ ముందుకు సాగి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నేత పెనుముచ్చు ప్రవీణ్, పెనుముచ్చు గణేష్, శెట్టి రాంబాబు, చింతకాయల గణేష్, దంతులూరి కిషోర్‌రాజు, దివాణం తదితరులున్నారు.

వాటర్‌ట్యాంక్‌కు శంకుస్థాపన

కిర్లంపూడి, అక్టోబరు 28: మండలంలోని రామచంద్రపురం గ్రామంలో నిర్మించే వాటర్ ట్యాంక్‌కు సోమవారం జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ శంకుస్థాపన చేశారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో టాప్ 5లో నాని



కిర్లంపూడి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడికి చెందిన ఏనుగు నాని విజయనగరంలో ఆదివారం జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో మెన్ ఫిజిక్ విభాగాల్లో టాప్ 5లో నిలిచాడు. తాను పడ్డ కష్టానికి టాప్ 5లో రావడం సంతోషంగా ఉందని, మిస్టర్ ఆంధ్ర నెం 1 రావడమే తన లక్ష్యమని నాని తెలిపాడు.

చుక్కనీరొస్తే ఒట్టు

గొందిగూడెంలో రెండు నెలలుగా పనిచేయని బోరు

మోతుగూడెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పంచాయతీ గొందిగూడెం గ్రామంలో బోరు రెండు నెలలుగా పని చేయట్లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పై గుంపకెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవట్లేదని పై గుంపు బందం దూలయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అధికారులు స్పందించి బోరు పంపునకు మరమ్మతులు చేయించాలని గొందిగూడెం కింద గుంపు గిరిజనులు కోరుతున్నారు.

